Crime Mirror
QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
7-3-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 113

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# ముసాయిదా బిల్లుకు రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం

## ఎస్సీ కులాల వర్గీకరణ బిల్లుకు కూడా గ్రీన్‌సిగ్నల్

## కోర్ అర్బన్ ఏరియాగా ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం



### మిగిలిన ప్రాంతం అంతా గ్రామీణ తెలంగాణ

### 56 గ్రామాలతో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ ఏరియా ఏర్పాటు

### ఒకే గొడుగు కిందకు ఎస్‌హెచ్‌జీలు..సెర్ప్, మెప్మా విలీనం

### టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బోర్డు

### కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

హైదరాబాద్: ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. స్థానిక సంస్థల్లో, విద్యారంగంలో, ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే మరో ముసాయిదా బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుదీర్ఘంగా సమావేశమైన రాష్ట్ర కేబినెట్ ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశానంతరం రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరాలు విలేకరులకు వెల్లడించారు.

2లో



## అమెరికా సుంకాలపై అధ్యయనం చేస్తున్నాం

బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా చర్చ చేస్తున్నాం

బాధ్యతగా ఎపికి సహకారం అందిస్తున్నాం

మీడియాతో కేంద్రమంత్రి

2లో



## అధికార కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే షాక్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో చతికిలపడ్డ పార్టీ

క్షేత్రస్థాయిలో కానరాని సమన్వయం

అధికారం దక్కడంతో ప్రజలకు దూరంగా కార్యకలపాలు

## ఎన్టీఆర్ దగ్గర ఇద్దరమూ తర్ఫీదు పొందాం

ఎన్టీఆర్ ఆదేశాలను తప్పకుండ పాటించేవాళ్లం


దగ్గుబాటిలో ఇంతటి డెప్త్ ఉందనుకోలేదు

ప్రపంచచరిత్ర పుస్తకావిష్కరణలో సిఎం చంద్రబాబు




2లో

**విశాఖపట్నం,(క్రైమ్ మిర్రర్):** మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ప్రపంచతత్వం, నాయకత్వంపై అధ్యయనం చేసి పుస్తకం రాశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ప్రతి అంశాన్ని లోతుగా విశ్లేషిస్తారని.. ఆయన పుస్తకం రాస్తారని ఎప్పుడూ అనుకోలేదని.. వెంకటేశ్వరరావులో ఇంత డెప్త్ ఉందని తెలియదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖలోని గీతం యూనివర్సిటీలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.



## పునాదిని మించిన గుంత లోతు

### పెను ప్రమాదంలో శ్రీశైలం జలాశయం

### తక్షణమే అధ్యయనాలు, మరమ్మతులు చేపట్టాలన్న ఎన్డీఎస్ఏ కమిటీ

### గుంతతో ఇప్పటికే షీర్‌జోన్ ప్రభావితమై ఉండవచ్చు

### డ్యామ్ భద్రతకు ఇది అత్యంత ప్రమాదకరమన్న నిపుణులు

హైదరాబాద్: 'ఉభయ తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు శ్రీశైలం భద్రత పెను ప్రమాదంలో ఉంది. డ్యామ్ పునాదుల కింద భూగర్భంలోని భారీ రాతిఫలకాల మధ్య పెళుసుతో కూడిన బలహీన అతుకులున్నట్టు జియలాజికల్ సమాచారం స్పష్టం చేస్తోంది. నిలువుగా రెండు భారీ జాయింట్లు, వాటికి అనుబంధ జాయింట్లూ ఉన్నట్టు తెలుపుతోంది. అనుబంధ జాయింట్ల మధ్య దూరం పెరిగితే డ్యామ్ పునాదులు రక్షణను కోల్పోయి జారిపోయే ప్రమాదం ఉంది.

2లో

## కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టారు

ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చండి

ఎమ్మెల్సీల విజయంతో మా బాధ్యత పెరిగింది

ప్రజా సమస్యలపై ఇక చట్టసభల్లో నిలదీస్తాం

సిఎం రేవంత్ గారి మాటలకు సమాధానం చెప్పాలా

మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2లో



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించి అఖండ విజయాన్ని కట్టబెట్టిన తెలంగాణ సమాజానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు .



## విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం

శంకుస్థాపన చేసిన ట్రస్టీ నారా భువనేశ్వరి

వచ్చే ఏడాదికల్లా అందుబాటులోకి తెస్తామని ప్రకటన

**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్టు భవన్ నిర్మాణానికి ఎన్టీఆర్ మెమోరియల్



2లో

## కమీషన్ల కక్కుర్తితోనే ఎస్ఎల్‌బిఎసి ప్రమాదం

ప్రమాదానికి ప్రభుత్వానిదే బాధ్యత: కెటిఆర్



## అమెరికా సుంకాలపై అధ్యయనం చేస్తున్నాం

**విశాఖపట్నం,(క్రైమ్ మిర్రర్):** భారత్‌పై అమెరికా సుంకాల మోతపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. సుంకాల విషయమై చర్చలకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లారని తెలిపారు. అమెరికా వాణిజ్య మంత్రులతో ఆయన చర్చలు జరుపుతున్నారని చెప్పారు. భారత్ ఎగుమతుల విషయాన్ని దృష్టిలో ఉంచుకుని చర్చలు ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలు, చార్టెడ్ అకౌంటెంట్స్, లాయర్లు, వ్యాపార సంఘాల నుంచి సలహాలు, సూచనలు తీసుకొని బడ్జెట్‌లో మార్పులు చేస్తామని స్పష్టం చేశారు. ఆర్థిక వేత్తలు, వివిధ వర్గాల మేధావులతో కేంద్ర బడ్జెట్‌పై విశాఖలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏపీకి కేంద్రంతో ముడిపడిన ప్రతి ప్రాజెక్టుకు ఎలాంటి లోటు లేకుండా చూస్తున్నట్టు పునరుద్ఘాటించారు. విశాఖ ఉక్కు పూర్వ వైభవానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. 'ఏటా బడ్జెట్ టేబుల్ చేశాక మధ్యలో గడువు ఉంటుంది. మళ్లీ పార్లమెంట్ మొదలయ్యాక ఫైనాన్స్ బిల్లుపై చర్చ జరుగుతుంది. ఆ తర్వాత ఆమోదం ఉంటుందన్నారు. ముఖ్యమైన అభిప్రాయాలు, సూచనలొస్తే సవరణలు చేసి బడ్జెట్‌ను ఆమోదిస్తాం. ప్రభుత్వ ఖర్చులతో రోడ్లు, ఆసుపత్రులు, విమానాశ్రయాలు నిర్మిస్తున్నాం. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఒక్కో ఇంటికి తాగునీరు అందిస్తున్నాం. మనం ఉపయోగించుకున్న వాటికే పన్ను చెల్లిస్తాం. కారు కొంటే దానిపైనే పన్ను చెల్లిస్తాం.. కొనని వారు చెల్లించరు. రోడ్డు వినియోగించుకున్న వారే టోల్ ట్యాక్స్ చెల్లిస్తారు. ప్రజలు పన్నులు చెల్లిస్తేనే రహదారులు నిర్మించగలిగేది' అని ఆర్థిక మంత్రి వివరించారు.కేంద్ర ప్రభుత్వంగా కాదు.. మా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందిస్తున్నాం అని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..అన్నారు.. బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత దేశ వ్యాప్తంగా చర్చలు నిర్వహిస్తున్నాం. మొదట ముంబైలో.. రెండో చర్చ విశాఖ లో నిర్వహించాం అన్నారు.. విశాఖలో బ్జడెట్ పై వివిధ వర్గాల ప్రజలను కలసి వారి సలహాలు, సూచనలు తీసుకున్నాం అన్నారు.

# కమీషన్ల కక్కుర్తితోనే ఎస్ఎల్‌బిఎసి ప్రమాదం

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇంకొంతమంది మంత్రులు కమీషన్ల కోసం కక్కుర్తి పడడంతోనే ఎస్.ఎల్.బి. సి టన్నెల్ ప్రమాదం జరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ఆరోపించారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించిన రెండు నివేదికలు ప్రభుత్వం దగ్గర ఉన్నప్పటికీ తమ సొంతలాభం కోసం టన్నెల్ పనులు కొనసాగించి ఎనిమిది మందిని బలిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనం వృథా చేయడంతో పాటు ఎనిమిది కుటుంబాల్లో ఎడతెగని శోకానికి కారణమైన ప్రమాదానికి రాష్ట్ర కేబినేట్ బాధ్యత వహించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టన్నెల్ పనులు చేస్తున్న జైప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ 2020లో అంబర్గ్ టెక్ ఏజి అనే సంస్థతో టన్నెల్ ప్రాంతంలో ఓ సర్వే నిర్వహించారని చెప్పారు. టన్నెల్ సిస్మిక్ ప్రెడిక్షన్ (టిఎస్‌పి) సర్వే చేసి మొన్నటి ప్రమాదాన్ని 2022లోనే అంబర్గ్ టెక్ ఏజి ఊహించి హెచ్చరించిందని అన్నారు.టన్నెల్‌లోని 13.88 కి.మీ నుండి 13.91 కి.మీ మధ్య ఫాల్ట్ జోన్ ఉందని స్పష్టంగా చెప్పారని, ఆ ప్రాంతంలోని రాళ్లు ధృడంగా లేకపోవడంతో పాటు నీటి లీకేజీలు భారీగా ఉన్న సంగతిని హైలెట్ చేశారని తెలిపారు. ఆ రిపోర్ట్‌లో ఉన్నట్టుగానే మొన్నటి ప్రమాదం ఫాల్ట్ జోన్‌లోనే జరిగిందని అన్నారు. 2022లోనే జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్ మండపల్లి రాజుతో పాటు జైప్రకాష్ అసోసియేట్స్ భూగర్భ శాస్త్రవేత్త రితురాజ్ దేశ్ముఖ్‌లు చేసిన మరో సర్వే రిపోర్ట్ కూడా ప్రభుత్వం దగ్గర ఉందని పేర్కొన్నారు. ఆ నివేదిక ప్రకారం టన్నెల్ ఉపరితలాన్ని సరిగా అంచనా వేయకుండానే నిర్మాణాన్ని మొదలుపెట్టారని చెప్పారు. ఎస్.ఎల్.బి.సి టన్నెల్లో ప్రమాదం జరుగుతుందని ముందే చెప్పిన ఈ నివేదికలను రేవంత్ ప్రభుత్వం దాచి పెట్టి కార్మికులతో పనులు చేయించిందని ఆరోపించారు. ఈ రెండు నివేదికలపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వడంతో పాటు హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

## పునాదిని మించిన గుంత లోతు

ఇది డ్యామ్ భద్రతకు అత్యంత ప్రమాదకరం. డ్యామ్ దిగువన ఏర్పడిన భారీ గుంత (ప్లంజ్‌పూల్) 120 మీటర్ల లోతైనదని 2018 జూలైలో నిర్వహించిన బాతిమెట్రిక్ సర్వేలో తేలింది. గుంత లోతు డ్యామ్ పునాదుల లోతుకు మించిపోయినట్టు తెలుస్తోంది. గుంత.. డ్యామ్ పునాదుల వరకు విస్తరించి రాతిఫలకాల మధ్య పెళుసుతో ఉన్న జాయింట్ల (షీర్ జోన్)ను ప్రభావితం చేసి ఉండవచ్చు. డ్యామ్ జారిపోకుండా రక్షణ కల్పించే పునాదుల మందం గణనీయంగా తగ్గిపోయి ఉండవచ్చు..' అని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)కి చెందిన నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. జలాశయం భద్రత దృష్ట్యా తక్షణమే పలు అధ్యయనాలు, మరమ్మతులు చేపట్టాలని సిఫారసు చేసింది.

**2009 వరదలతో పెరిగిన ముప్పు**

ఎన్డీఎస్ఏ సభ్యులు (విపత్తుల నిర్వహణ) వివేక్ త్రిపాఠి నేతృత్వంలో డిప్యూటీ డైరెక్టర్ అమిత్ మిట్టల్, కన్సల్టెంట్ కమలేశ్ జైన్‌తో సంస్థ ఈ కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కృష్ణాబోర్డు, సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల నిపుణులు కూడా కమిటీలో ఉ న్నారు. ఈ కమిటీ గత ఏడాది శ్రీశైలం జలాశయాన్ని సందర్శించింది. అనంతరం తన నివేదికను సమర్పించింది. తాజాగా వెలుగు చూసిన నివేదిక వివరాలిలా ఉన్నాయి.

# ముసాయిదా బిల్లుకు రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీల వర్గీకరణ చేపట్టడానికి ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ గత నెల 3న సమర్పించిన తొలి విడత సిఫారసులపై వివిధ వర్గాల నుంచి 71 విజ్ఞప్తులు వచ్చాయని పొంగులేటి తెలిపారు. ఈ విజ్ఞప్తులను పరిష్కరించిన అనంతరం తాజాగా కమిషన్ సమర్పించిన నివేదికను బిల్లు రూపంలో శాసనసభలో ప్రవేశపెట్టాలని మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా బిల్లును రూపొందించామన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు కొత్త బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో.. 37 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 2017లో సభలో ప్రవేశపెట్టిన బిల్లును వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్టు పొన్నం ప్రభాకర్ వివరించారు. 'రాష్ట్రాన్ని మూడు సెక్టార్లుగా విభజించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ ఏరియాగా, అక్కడి నుంచి ట్రిపుల్ ఆర్ రోడ్డుకు ఆవల 2 కి.మీల బఫర్ జోన్ వరకు ఫ్యూచర్ సిటీగా, మిగిలిన ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా విభజించాలని నిర్ణయించాం. రూరల్ తెలంగాణ పరిధిలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు రావు. 7 మండలాల్లోని 56 గ్రామాలతో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ ఏరియా (ఎఫ్‌సీడీఏ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. నాగార్జునసాగర్, శ్రీశైలం హైవేల మధ్య ఉన్న 30 కి.మీల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నాం. హెచ్ఎండీఏ పరిధిలోని 36 గ్రామాలను ఎఫ్‌సీడీఏకి బదిలీ చేశాం. ఫ్యూచర్ సిటీ కోసం 90 పోస్టులను ఆమోదించాం. హెచ్ఎండీఏ పరిధిని రీజినల్ రింగ్ రోడ్డుకు 2 కి.మీల బఫర్ జోన్ వరకు పొడిగించాం. 11 జిల్లాల్లోని 104 మండలాలు, 1,355 గ్రామాలకు హెచ్ఎండీఏ పరిధి విస్తరించింది. కొత్తగా 332 రెవెన్యూ గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తాయి..' అని పొంగులేటి తెలిపారు. 'కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి మిషన్ కింద రూపొందించిన పాలసీ%-%2025ని కేబినెట్ ఆమోదించింది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధికి అందించిన సహకారాన్ని మళ్లీ కొత్త పాలసీతో పునరుద్ధరిస్తాం. మహిళా స్వయం సహాయక సంఘాలు ఒకే గొడుగు కింద ఉండాలనే ఉద్దేశంతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లను ఒకే సంస్థగా విలీనం చేయాలని నిర్ణయించాం. ఇందిరా మహిళా శక్తి సంఘాల మహిళల రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పొడిగించడంతో పాటు సభ్యులుగా చేరేందుకు కనీస వయస్సును 18 నుంచి 15 ఏళ్లకు కుదించాం..' అని మంత్రి చెప్పారు. 'తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకోసం తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రెలిజియస్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ 1987ను సవరించాలని నిర్ణయించాం.

# ఎన్టీఆర్ దగ్గర ఇద్దరమూ తర్ఫీదు పొందాం




(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు , మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి,ఎంపి శ్రీభరత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. దగ్గుబాటి వెంకటేశ్వరరావు తమ కుటుంబంలో విశిష్టమైన వ్యక్తి అని, వెంకటేశ్వరరావు నా తోడల్లుడు. ఎన్టీఆర్ వద్ద ఇద్దరం అన్నీ నేర్చుకున్నాం. ఆయన పుస్తకం రాస్తారని నేనెప్పుడూ అనుకోలేదు. రచయిత కానటువంటి రచయిత వెంకటేశ్వరరావు. ఎవరూ చేయని సాహసాన్ని ఆయన చేశారు. ప్రపంచ చరిత్రలో ఆది నుంచి ఇప్పటి వరకు మొత్తం వివరాలను పుస్తకంలో పొందు పరిచారు. ఎన్టీఆర్ అప్పుజెప్పిన బాధ్యతలు నెరవేర్చేవాళ్లమి చెప్పారు. ఎన్ని కష్టాలున్నా సంతోషంగా కనిపిస్తారు. కలిసి 40 ఏళ్లు ఉన్నామని.. ఆయనలో ఇంత డెప్త్ ఉందని.. పుస్తకం రాస్తారని ఎప్పుడూ ఊహించలేదని అన్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఒక డాక్టరని.. ఆయన లైఫ్‌ను చాలా బాగా గడుపుతారని, ఆయన డాక్టర్ ప్రాక్టీస్ చేయకుండా సినిమాలు తీశారని.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, మంత్రిగా పనిచేశారని, ఒకసారి లోక్ సభ, మరోకసారి రాజ్యసభ మెంబర్‌గా ఉన్నారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇప్పటి వరకు ఆయన ఐదు పుస్తకాలు రాశారన్నారు. మొదటిది 'చరిత్రలో కొన్ని నిజాలు' రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 'ఏర్పాటు వాదం ఎందుకొచ్చింది' పుస్తకం రాశారని.. మూడో పుస్తకం.. 'ప్రపంచ తత్వం.. నాయకత్వం' రాశారన్నారు. నాలుగోది.. 'ప్రపంచ దేశాలు..పాలనా వ్యవస్థలు' రాశారు. ఇప్పుడు 'ప్రపంచ చరిత్ర' ఆది నుంచి నేటి వరకు పుస్తకం రాశారని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వ విధ్వంస పాలనతో అందరం ఆవేదన చెందాం. గీతం వంటి ఉత్తమ విద్యాసంస్థను ఏం చేశారో చూశారు. ఇటీవల ఎన్నికల్లో దగ్గుబాటి పురందేశ్వరి చొరవను అందరం చూశాం. రాష్ట్ర ప్రజలకు మంచి చేసేందుకు అది ఉపయోగపడిందని చంద్రబాబు అన్నారు. తెలుగులో దగ్గుబాటి రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. రాబోయే తరాలకు జ్ఞానం, విజ్ఞానం అందించాలని మన పెద్దలు ఎప్పుడూ చెబుతుంటారని.. ప్రపంచ చరిత్రలో జరిగిన పరిణామ క్రమాన్ని సరళమైన భాషలో తీసుకురావడం ముదావహమని కొనియాడారు. భారత చరిత్రను కూడా రాయాలని ఈ సందర్భంగా దగ్గుబాటి వెంకటేశ్వరరావును వెంకయ్య కోరారు. భారత దేశచరిత్రలో విజయాలు సాధించిన ఎందరి గురించో మనం విన్నామని.. అలాంటి గాథలను ఒక చోట చేర్చి వెంకటేశ్వరరావు పుస్తకం రాశారని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మరింత అధ్యయనం చేసి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాలన సహా అన్ని విషయాలు రాయాలని ఆమె కోరారు.

# కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టారు

బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ విజయం తెలంగాణ సమాజానికి, ఉపాధ్యాయులకు అంకితం ఇస్తున్నామని అన్నారు.రెండు ఎమ్మెల్సీలు ఏక కాలంలో రావడం చాలా సంతోషం. గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీని ఆదరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ తో సమానంగా తెలంగాణ సమాజం బీజేపీకి ఎంపీ సీట్లు కట్టబెట్టింది . మూడు స్థానాల్లో రెండు కీలకమైనవి. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంలో బీజేపీని గెలిపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేశాయని గ్రహించే రాష్ట్ర ప్రజలు బీజేపీని గెలిపించారని కిషన్ రెడ్డి అన్నారు. రెండు ఎమ్మెల్సీల విజయంతో బీజేపీ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి బీజేపీపైన అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన రెండు ఎన్నికల్లో బీజేపీని గెలిపించారని.. కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టారని కిషన్ రెడ్డి అన్నారు. శాసన మండలి, సభలో ప్రజల సమస్యలపైన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం అన్నారు. శాసన మండలి, సభలో తెలంగాణ ప్రజల గుండె చప్పుడు వినిపిస్తాం. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉంది. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలనకు రెఫరండమని తాము అనడం లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఇప్పటివరకైనా నెరవేర్చాలని గుర్తు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ గిఫ్ట్ మాకు అవసరం మాకు లేదు.. రాహుల్ గాంధీకి ఇచ్చుకోండి. తెలంగాణ ప్రజలు మాకు గిఫ్ట్ ఇస్తున్నారు.. ఇస్తారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని కిషన్ రెడ్డి కాంగ్రెస్‌ను విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గాలి మాటలకు సమాధానం చెప్పాలా అని షన్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం గాలి మాటలకు సమాధానం, సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి నాపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఆ ఆరోపణలకు ప్రజలే సరైన సమాధానం ఇచ్చారు. ప్రజా తీర్పు.. కాంగ్రెస్ పాలనకు చెంపపెట్టులాంటిదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, యువతకు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, దళితులకు రూ.12 లక్షలు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని ఆ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నాం. జీవో 317 కారణంగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన ఇద్దరు ఎమ్మెల్సీలను కిషన్ రెడ్డి అభినందించారు.

## విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం

ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి గురువారం ఉదయం శంఖుస్థాపన చేశారు. స్థానిక సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శంకుస్థాపన కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. విజయవాడ టీచర్స్ కాలనీలోని సాయిబాబా గుడి వీధిలో 600 గజాల స్థలంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు.ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. ఐదంతస్థుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని.. సమాజానికి ఏది అవసరమో, సేవభావంతో అది చేసేందుకు ఎన్టీఆర్ ట్రస్టు ఎప్పుడూ ముందు ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఏదైతే చెప్పామో అది చేసి చూపటమే ఎన్టీఆర్ ట్రస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. రక్తదానంతో పాటు తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులను ఆదుకునే లక్ష్యంతో ఇక్కడ సేవలు అందిస్తామని భువనేశ్వరి స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సేవకు ట్రస్టు తలుపులు ఎప్పుడు కొట్టినా 24 గంటలూ అందుబాటులో ఉంటామన్నారు. ఫిబ్రవరి 2026లో విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు అందుబాటులోకి వస్తాయని నారా భువనేశ్వరి చెప్పారు. విద్య, వైద్య సేవా కార్యక్రమాలు రాష్ట్రంలో మరింత విస్తృతం చేసే లక్ష్యంతో భవన నిర్మాణం చేపడతామన్నారు.

# అధికార కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే షాక్

**కరీంనగర్,(క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే షాక్ తగిలింది. కాంగ్రెస్ కొత్త వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఇక్కడికి వచ్చిన సమయంలోనే ఎమ్మెల్సీ ఫలితాలు చేదు అనుభవాన్ని చూపాయి. కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్తాయిలో పనిచేయాలని, నటనలు చేయొద్దని హెచ్చరిస్తున్న నేపథ్యంలోనే రెండు ఎమ్మెల్సీలను బిజెపి కైవసం చేసుకుంది. ఇది ఓ రకంగా అధికార కాంగ్రెస్‌కు హెచ్చరిక లాంటిది.ఉత్తర తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ ఎన్నికల్లో రెండు స్థానాలను బిజెపి ఎగురేసుకు పోయింది. గ్యాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలను రెండూ బిజెపి ఖాతాలో పడ్డాయి. ఇది ఓ రకంగా విద్యావంతుల్లో కాంగ్రెస్ పట్ల నిరసనలకు నిదర్శనంగా చూడాలి. ఉద్యోగాల భర్తీపై నిరుద్యోగుల్లో ఉన్న నిసనగా చూడాలి.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీలో మల్క కొమురయ్యలు విజయం సాధించారు. ఉమ్మడి కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాన్ని ఆరేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నెగ్గిన కాంగ్రెస్‌కు ఇప్పుడు అధికారంలో ఉన్నా ఎదురుదెబ్బ తగిలింది. సిటింగ్ స్థానం కావడం... రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నందున తప్పనిసరిగా గెలిచి తీరాలని అధిష్ఠానం పీసీసీకి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశర చేసినా చివరికి ఓటమి తప్పలేదు. త్వరలో మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల్లో నియామకాలు, పీసీసీ కార్యవర్గంలో పదవుల పంపకం ఉంటుంది కాబట్టి ఆశావహులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేస్తారని తొలుత అందరూ భావించారు. కానీ వారు కూడా పెద్దగా క్షేత్రస్థాయిలో తిరగలేదు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు వచ్చే మెజార్టీనే ఎమ్మెల్యేల పనితీరుకు గీటురాయిగా పరిగణిస్తామని పార్టీ ముందే అంతర్గతంగా చెప్పినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టాలని భాజపాకు పరోక్షంగా మద్దతు ఇచ్చేందుకు భారాస లోపాయికారీ ఒప్పందం చేసుకుందని తాము ముందే పలుమార్లు చెప్పినా ఈ వ్యూహాన్ని ఛేదించేందుకు క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికతో పనిచేయలేదని అధికార పార్టీ నేతలు పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సొంత జిల్లా నిజామాబాద్‌లో సైతం నేతలు సరిగా పనిచేయలేదు. పైగా ఆయన పీసీసీ పగ్గాలు చేపట్టిన తరవాత నేరుగా జరిగిన తొలి ఎన్నిక ఇది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలను పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఓటర్ల దగ్గరకు వెళ్లి చెప్పి ఆకట్టుకోలేకపోయారు. ఓటర్లంతా పట్టభద్రులు కావడంతో వారిని ఆకట్టుకోవడానికి ప్రత్యర్థులు సోషల్ మీడియాలో ప్రచారాన్ని ప్రధాన అస్త్రంగా వినియోగించుకుంటే కాంగ్రెస్ నేతలు ఈ విషయంలో పట్టనట్లు వ్యవహరించారనే విమర్శలున్నాయి. అభ్యర్థి ఎంపికలో జాప్యం జరగడం, ముందు నుంచి అనుకున్నవారికి కాకుండా చివరి క్షణంలో మరొకరికి టిక్కెట్ ఇవ్వడం కూడా పార్టీకి నష్టం కలిగించిందన్న విమర్శలు ఉన్నాయి. పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వెళ్లి మూడు చోట్ల సభలు పెట్టినా ఫలితం దక్కలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ భారాస ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో కాంగ్రెస్, భాజపాల మధ్య ద్విముఖ పోరు గురించే ఎక్కువగా చర్చ జరిగింది. కానీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గట్టి పోటీనివ్వడం కాంగ్రెస్‌ను దెబ్బతీసింది. వాస్తవానికి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని హరికృష్ణ చాలా ముందు నుంచే క్షేత్ర స్థాయిలో పనిచేశారు. చివరిక్షణంలో నరేంద్‌రెడ్డిని తెరపైకి తేవడంతో హరికృష్ణ బీఎస్పీ నుంచి బరిలోకి దిగడం కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారింది. హరికృష్ణకు టికెట్ ఇవ్వాలని కోరిన కొందరు కాంగ్రెస్ నేతలు పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి కష్టపడి పనిచేయలేదని తెలుస్తోంది. ఉద్యోగులకు, రిటైరైన వారికి బిల్లుల చెల్లింపులు రాష్ట్ర ప్రభుత్వం బాగా ఆలస్యం చేస్తుండటం కూడా విద్యావంతుల్లో అసంతృప్తి ఉన్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం 15 జిల్లాలు, 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ జిల్లాల పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ముగ్గురు మంత్రులు, నలుగురు ఇంఛార్జి మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

## బీజేపీ ఎమ్మెల్సీకి ప్రధాని అభినందనలు

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంతో కొత్తగా ఎన్నికైన మల్క కొమరయ్య, అంజిరెడ్డిని ప్రధాని మోదీ అభినందించారు. బీజేపీకి మద్దతుగా నిలిచిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలతో కలిసి పనిచేస్తున్న తమ పార్టీ కార్యకర్తలను చూసి గర్విస్తున్నానన్నారు. కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గపు ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య విజయం సాధించారు. కొమరయ్య విజయం రెండు రోజుల క్రితమే ఖరారుకాగా, పట్టభద్రుల ఫలితం బుధవారం వెలువడింది. కాగా, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోవడంతో.. రెండో ప్రాధాన్య ఓట్లతో అంజిరెడ్డి గెలుపొందారు. రెండు రోజుల పాటు జరిగిన కౌంటింగ్ ప్రక్రియ అడుగడుగునా ఉత్కంఠ రేపింది. బీజేపీ-కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య 'నువ్వానేనా' అన్నట్టుగా గెలుపు దోబూచులాడింది. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పట్టభద్రుల స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 28,686 ఓట్లు చెల్లలేదు.వీటిలో 75,675 బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి, 70,565 కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి, 60,419 ఓట్లు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు వచ్చాయి. నిబంధనల ప్రకారం మొదటి ప్రాధాన్యతలోనే 1,11,672 ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటించాలి. కానీ మొదటి ప్రాధాన్యంలో ఏ అభ్యర్థికి కూడా అన్ని ఓట్లు రాలేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్లు లెక్కించారు. మొత్తం 56 మంది పోటీచేయగా, రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించేందుకు గాను 54 మందిని ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. చివరకు బీజేపీ అభ్యర్థికే అత్యధిక ఓట్లు వచ్చాయి. గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు రాకపోయినా 5వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యం ఉండడంతో మూడో ప్రాధాన్యానికి వెళ్లకుండా అంజిరెడ్డి గెలిచినట్టు అధికారులు ప్రకటించారు.

## తాగునీటిని ఇతర అవసరాలకు వాడితే జరిమానా

**సిద్దిపేట,(క్రైమ్ మిర్రర్):** వాటర్‌బోర్డు సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించిన ఘటన జూబ్లీహిల్స్‌లో బుధవారం చోటుచేసుకుంది. వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ ప్రధాన రహదారిపై వెళ్తుండగా రోడ్డు నంబర్ 78లో నీరు లీకేజీ అవుతున్నట్లు గమనించాడు. స్థానిక జీఎం హరి శంకర్‌ను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో ఆయన మేనేజర్‌తో కలిసి అక్కడికి వెళ్లి చూడగా ఓ వ్యక్తి వాటర్‌బోరు సరఫరా చేసే నీటితో బైక్‌ను కడుగుతున్నాడు. ఈ విషయాన్ని ఎండీకి వివరించగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడికి నోటీసు అందించి రూ.వెయ్యి జరిమానా విధించారు. తాగునీటి కోసం ఉద్దేశించిన రక్షిత నీటిని వాహనాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్, ఇళ్ల పరిసరాలను కడగడానికి వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## వీసా గడువు ముగిసినా నగరంలోనే తిష్ట

### ముగ్గురిని విదేశీయులను అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** నగరంలో చాలామంది విదేశాల నుంచి వచ్చి వీసా గడుపు ముగుస్తున్నా అక్కడకు వెళ్లడం లేదు. దీంతో ఇలాంటి వారిని పట్టుకునేందుకు పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే వీసా గడువు ముగిసినా నగరంలో అక్రమంగా ఉంటూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు విదేశీయులను వెస్ట్‌జోన్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి దేశాలకు పంపించారు. లైబీరియాకు చెందిన కర్మో మార్టిన్ స్టూడెంట్ వీసాపై 2019లో నగరానికి వచ్చాడు. నిజాం కళాశాలలో 2020 నుంచి 2023 వరకు చదువుకున్నాడు. బ్యాక్ లాగ్‌లు ఉన్నాయని తప్పుడు సమాచారం ఇస్తూ వీసాను పొడిగించుకుంటున్నాడు. సీసీఎస్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకొని ఫిబ్రవరి 26న లెబనాన్‌కు పంపించారు. ఉగాండాకు చెందిన పి కబటుకు మేరీ అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలంటూ మెడికల్ వీసాపై 2024 డిసెంబర్‌లో నగరానికి వచ్చింది. నగరంలో ఉంటూ వ్యభిచారం చేస్తుండగా సీసీఎస్ అధికారులు అరెస్ట్ చేశారు. విచారణలో మెడికల్ వీసాపై వచ్చిన మేరీ ఇప్పటి వరకు అపోలో ఆస్పత్రికి వెళ్లలేదని తెలుసుకున్నారు. ఆమెను ఈనెల 4న ఉగాండాకు తిరిగి పంపించారు. నైబీరియాకు చెందిన స్టూడెంట్ వీసాపై 2022లో నగరానికి వచ్చాడు. ఏవీ కాలేజ్‌లో చదువుకునేందుకు వీసా తీసుకున్న ఇతడు కనీసం అడ్మిషన్ కూడా తీసుకోకుండా అక్రమంగా ఉంటున్నాడు. వ్యభిచార గృహం నిర్వహణ కేసులో సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతడిని ఈనెల 5న లైబీరియాకు పంపించారు.


## అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

### భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం

**ఆదిలాబాద్, (క్రైమ్ మిర్రర్):** అటు ప్రకృతి కన్నెర్ర.. ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు ఆత్మహత్య బాట పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరేడుకొండ మండలంలో ఓ రైతు దంపతులు అప్పుల ఇబ్బందులతో ఆత్మహత్యకు ఒడిగట్టారు. వీరిలో భర్త మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని వదూర్‌కు చెందిన ఆడెపు పోశెట్టి(60), ఇందిరా(52) అనే రైతు దంపతులు ఆర్థిక సమస్యల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. పోశెట్టి మరణించగా భార్య ఇందిరాను చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి దంపతులకు మూడెకరాల భూమి ఉండగా ఇటీవల పత్తి కంది పంటలను సాగు చేశారు. వీరికి రెండు లక్షల 30 వేల వరకు అప్పులు ఉన్నాయి. పంట నష్టంతో పాటు వారికి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సైతం మాఫీ కాలేదు. ఇటీవల ఇద్దరు కూతుర్ల వివాహం చేయడంతో పాటు, నూతన గృహం సైతం నిర్మించినట్లు స్థానికులు తెలిపారు.

## ప్రేమను నిరాకరించడంతో చొప్పదండిలో ప్రేమికుల ఆత్మహత్య





**కరీంనగర్, (క్రైమ్ మిర్రర్):** ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరంలోని చొప్పదండి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం..చొప్పదండి మండలం చిట్యాలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్ (24), అదే మండలం భూపాలపట్నంకు చెందిన నాంపెల్లి అలేఖ్య (22) గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. దగ్గరి బంధువులు కూడా అయిన వీరు అలేఖ్య తల్లి దండ్రులకు తమ ప్రేమ విషయాన్ని తెలిపారు. అయితే అలేఖ్య తల్లిదండ్రులు కొంత కాలం క్రితం అరుణ్ ఇంటికి వెళ్లి మీ అబ్బాయికి మా అమ్మాయిని ఇస్తామని ఆయన తల్లి దండ్రులను అడిగారు. అరుణ్ తల్లిదండ్రులు ఇప్పుడే పెండ్లి చేయమని చెప్పారు. అప్పటి నుంచి ఈ రెండు కుటుంబాలు కాస్త దూరంగా ఉంటున్నాయి. ఈ మధ్య అలేఖ్యకు వేరే సంబంధం చూసి పెండ్లి నిశ్చయం చేశారు. ఈ నేపథ్యంలో ఇద్దరు ప్రేమికులు మనస్థాపానికి గురయ్యారు. బుధవారం కాలేజీకి వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకుంటానని భూపాలపట్నం నుంచి అలేఖ్య కరీంనగర్‌కు వచ్చి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అరుణ్ వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి ఇద్దరు కలిసి స్థానిక వావిలాలపల్లిలో అరుణ్ అద్దె గదికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని కరీంనగర్ త్రీ టౌన్ సీఐ తెలిపారు. అరుణ్ తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

# అడుగంటుతున్న భూగర్భ జలాలు

## ఆందోళన చెందుతున్న రైతులు



**పెద్దపల్లి,(క్రైమ్ మిర్రర్):** రోజురోజుకూ భూగర్భ జలాలు పడిపోతున్నాయి. దీంతో ఒక వైపు బోర్లు ఎత్తిపోతుండగా.. మరో వైపు బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయి. దీంతో సాగు కష్టాల్లో, ఆర్థిక నష్టాల్లో రైతులు కూరుకుపోతున్నారు. నిన్న మొన్నటి వరకు పెద్దపల్లి జిల్లాపై కుండగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చుక్కనీరు లేకపోవడంతో బోర్లు, బావులు అడుగంటుతున్నాయి. దీంతో రైతులు తిరిగి బోర్లు వేసుకోవడం, బావులను పూడిక తీయడం లాంటి పనులను చేపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. తలాపున పారుతున్న గోదావరి నీ సేను నీ సెలుక ఎడారి అని స్థానిక కవి రచయిత మల్లావజ్జల సదాశివుడు మూడు దశాబ్దాల క్రితం తెలంగాణ సాగు నీటి కష్టాలను ఏకరువు పెట్టగా పదేళ్ల తర్వాత తిరిగి అదే పరిస్థితులు నెలకొనడంతో కాంగ్రెస్ పాలన వచ్చింది కష్టాలను వెంట బెట్టుకొని వచ్చిందనే విధంగా పాలన సాగుతుండటంతో రైతుల్లో అసహనం వ్యక్తం అవుతున్నది. పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం మండలాల్లో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. 2023 ఫిబ్రవరి నెలలో భూగర్భజలాలు 5.47మీటర్ల లోతులో ఉండగా 2024ఫిబ్రవరి మాసంలో 5.09మీటర్ల లోతులో, 2025 ఫిబ్రవరి మాసంలో 5.44మీటర్ల లోతులోకి పడిపోయాయి. బీఆర్ఎస్ పార్టీతో కక్షతో కాళేశ్వరంను పక్కన పెట్టి తెలంగాణ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా ముంచుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో మోటార్లతో పని లేకుండానే కాలువల్లో సాగు నీరు పారిందని, కాళేశ్వరం గేట్లు ఎత్తడంతో బోర్లన్నీ ఎత్తిపోయి బోర్లల్లో కూడా చుక్క నీరు రావడం లేదని మూడేళ్ల దాకా ఇక సాగు అంతేనా..? అలాగైతే తాము ఎలా బ్రతుకుతామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఈఏపీసెట్‌కు భారీగా దరఖాస్తులు

### ఐదు రోజుల్లోనే దాదాపు 48,158 మంది అభ్యర్థుల దరఖాస్తుల సమర్పణ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ఈఏపీసెట్ 2025కు గత శనివారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన సంగతి తెలిసిందే. మార్చి 1వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అయితే కేవలం ఐదు రోజుల్లోనే ఊహించని రీతిలో దరఖాస్తులు వచ్చాయి. దాదాపు 48,158 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఈఏపీసెట్ కో కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్ రెడ్డి తెలిపారు. వీరిలో 31,805 మంది ఇంజినీరింగ్, 16,317 మంది అగ్రికల్చర్-ఫార్మసీ, మరో 36 మంది రెండు విభాగాల పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4, 2025వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. రూ.2,500, రూ.5 వేల ఆలస్య రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారికి హైదరాబాద్‌లోని జోన్ 4లో మాత్రమే పరీక్షా కేంద్రాలు కేటాయిస్తారని ఇప్పటికే నోటిఫికేషన్‌లో ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తుల సవరణలకు ఏప్రిల్ 6 నుంచి 8 వరకు అవకాశం ఉంటుంది. రూ.250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 9వరకు, రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 14 వరకు, రూ.2,500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 18 వరకు, రూ.5 వేల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులకు తప్పనిసరిగా 2025 డిసెంబరు 31 నాటికి 16 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి అంటూ ఏమీ లేదు. ఇక బీటెక్ డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్, వెటర్నరీ సైన్స్, హార్టికల్చర్ కోర్సులకు 2025 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

# కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కవర్గం సంతోషంగా లేరు

### స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు

### రేవంత్‌రెడ్డి అవగాహన లేని పాలనతో కష్టాలు : హరీశ్‌రావు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఓ వర్గం సంతోషంగా లేరని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పాలనపై అవగాహన సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనరాహిత్యంతో అందరూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా స్కాలర్‌షిప్‌ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా విమర్శించారు. విదేశీ విద్యా పథకం కింద ఎంపికై, విదేశాలకు వెళ్లిన విద్యార్థులు స్కాలర్ షిప్ డబ్బులు రాక ఆవేదన చెందుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమన్నారు. నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుండడం.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా మారుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదని, స్కాలర్‌షిప్‌ల బకాయిల విడుదలకు మార్చి వరకు సమయం ఉందని మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట చెప్పి మూడు నెలలు పూర్తి కావస్తుందని, ఇప్పటివరకు మూడు రూపాయల బకా యిలు కూడా చెల్లించిన దాఖలు లేవని వెల్లడించారు. రేవంత్ సర్కారుకు బడా కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయడంపై ఉన్న ధ్యాస, పేద విద్యార్థుల చదువులకు బకాయిలు చెల్లించడంపై లేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా అగ్రవర్ణ పేద విద్యార్థులు విదేశాలకు వెళ్లి, ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన విదేశీ విద్య పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క విద్యార్థిని కూడా ఈ పథకం కింద ఎంపిక చేయలేదన్నారు. ఏడాదిన్నరగా ప్రక్రియ దరఖాస్తుల దశలోనే నిలిచిపోయిందని చెప్పారు. కొం దరు దరఖాస్తుదారులు ఇప్పటికే అప్పులు చేసి విదేశీ విద్యకు వెళ్లగా, మరికొందరు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పథకంలో ఎంపిక అవుతామేమో అనే ఆశతో ఇక్కడే ఉండి ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మొద్దునిద్రను వీడి తక్షణమే స్కాలర్షిప్ బకా యిలను విడుదల చేయాలని, విదేశీ విద్య పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి పేదలకు విదేశాల్లో చదివే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జానారెడ్డితో సిఎం రేవంత్ భేటీ

### తాజా రాజకీయాలపై ఇరు నేతల చర్చ



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తాజా రాజకీయాల నేపథ్యంలో అనూహ్యంగా సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సుమారు అరగంటకు పైగా వీరి మధ్య పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీపై ప్రభుత్వ వర్గాలలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. జానారెడ్డిని ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం అడిగితే సలహాలు ఇస్తానని జానారెడ్డి బుధవారం మీడియాతో తెలిపారు. దీంతో వీరి భేటీపై అంతా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. జానారెడ్డి వ్యాఖ్యల వల్లే.. ముఖ్య సలహాదారు పదవి ఆఫర్ చేయడానికి సీఎం వెళ్లారంటూ చర్చించుకుంటున్నారు. త్వరలో కేబినెట్ విస్తరణ ఉంటుందనే ఊహాగానాలతో ఈ భేటీ ప్రాధాన్యతతలను సంతరించుకుంది. అలాగే ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తదితర అంశాలపైనా ఇరువురు నేతలు చర్చించివుంటారని అనుకుంటున్నారు.

## అసత్య ప్రచారాలు చేస్తూ పరువునష్టం కేసు వేస్తాం : టీజీపీఎస్సీ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** :తెలంగాణ పబ్లిక్ కమీషన్ (టీజీపీఎస్సీ) మొత్తం 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి సంబంధించి గతేడాది గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 27వ తేదీ వరకు మొత్తం 7 పేపర్లకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 31,383 మంది క్వాలిఫై అవగా కేవలం 21,093 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే 67.17 శాతం మాత్రమే పరీక్ష రాశారన్నమాట. దీని ప్రకారం ఒక్కో పోస్టుకు దాదాపు 38 మంది పోటీపడుతున్నారు. మరోవైపు గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాల వెల్లడికి ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తుంది. అయితే తాజాగా గ్రూప్ 1 ఉద్యోగాలపై కొందరు వ్యక్తులు తప్పుడు వార్తలను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. తాజాగా వీటిపై స్పందించిన టీజీపీఎస్సీ ఆ వార్తలను ఖండించింది. సోషల్ మీడియాలో జరుగుతోన్న అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరువునష్టం దావా వేస్తామంటూ కమిషన్ ప్రకటించింది. అతి త్వరలోనే గ్రూప్ 1 ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేసింది. మార్కుల జాబితాను వెబ్‌సైట్‌లో పెడతామని.. అభ్యర్థుల లాగిన్‌లో పేపర్ల వారీగా మార్కులు చేసుకోవచ్చని పేర్కొంది. అంతేకాకుండా గ్రూప్ 1 నియామక ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతోందని, ఎలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకున్నామనీ పేర్కొంది. సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను అభ్యర్థులు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. టీజీపీఎస్సీ గ్రూప్ -1 పోస్టుల అమ్మకమంటూ సోషల్‌మీడియాలో గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరగడంతో టీజీపీఎస్సీ స్పందించింది. తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న వారిపై మార్చి 5 బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అలాగే సైబర్ క్రైమ్స్ డీసీపీకి సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది.

## ఎడిటోరియల్



# జనాభా పెరుగుదలతో యూపి, బీహార్‌లకు లబ్ది

## పార్లమెంట్ సీట్లు పెరిగితే బిజెపికే లాభం

పునర్విభజన జనాభా మేరకు జరిపితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి, దక్షిణిదిలో తగ్గుతాయి. ముఖ్యంగా జనాభాకు తగినట్టు సీట్లు పెంచాలంటే బీహార్, యు.పి వంటి చోట్ల సంఖ్య రెట్టింపవుతుంది. ఈ పెంపు అన్నది జనాభా పెరుగుదలకు కృషి చేసినందుకు బహుమానంగా భావించాల్సి ఉంటుంది. అయితే దక్షిణాదిలో సీట్లు తగ్గవని అమిత్ షా హామీ ఇస్తున్నా..నమ్మిక కుదరడం లేదు. ఎందుకంటే బిజెపి ఏది అనుకుంటే అది చేసి తీరుతుంది. ఒక లెక్క ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలకు 32 స్థానాలు పెరిగితే దక్షిణాదిన 24 తగ్గుతాయి. కేరళకు 20లో ఆరు నుంచి ఎనిమిది కోల్పోవలసి రావచ్చంటున్నారు. అదే ఉత్తరప్రదేశ్‌కు 80 నుంచి 91కి చేరతాయి. బీహార్‌కు పది పెరగ్గా ఎం.పి, రాజస్థాన్‌కు కూడా గణనీయమైన పెరుగుదల వుంటుంది. 1977లో సగటున ఒక్కో ఎం.పి 10.11 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహించేవారు. సగటు ఓటర్ల సంఖ్య నియోజకవర్గానికి ఎంత వుండాలనేదానిపై నిషేధమేమీ

లేదు. ఉదాహరణకు ఇప్పుడు కూడా అదే తరహాలో 10.11 లక్షల మందికి ఒకరి చొప్పున నిర్ణయించేట్టయితే ప్రస్తుత జనాభా ప్రకారం 1400 మంది లోక్‌సభ సభ్యులవుతారు. ఆ ప్రకారం యు.పి, బీహార్‌ల సభ్యుల సంఖ్య మూడంతలు పెరుగుతుంది. తమిళనాడు, కేరళ వంటివి రెండింతలే పెరుగుతాయి. అదే బీహార్, యు.పి లను తీసుకుంటే 2015లో కూడా వాటి జనాభా పెరుగుదల రేటు 4.0గా వుంది. మానవాభివృద్ధి సూచికల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు కొంత మెరుగ్గా వున్నాయి. హిందీ రాష్ట్రాలు ముఖ్యంగా పెద్దవైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల జనాభా మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వచ్చింది. జనాభా నియంత్రణ చర్యలలో నిర్లక్ష్యం, మత సంబంధాలతో సహా అనేక రాజకీయ కారణాలు దీని వెనక వున్నాయనేది స్పష్టం. ఉన్న చట్టం ప్రకారం ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన ఎజెండాలోకి రానుంది. అంటే ఇక్కడ ఒకటి పెరిగితే అక్కడ నాలుగు పెరుగుతాయి. ఏమైనా ఎంత జనాభా వుంటే ఒక లోక్‌సభ స్థానం, సాంకేతికంగా సమాన ప్రాతినిధ్య సూత్రమేమిటి అన్నదాన్ని బట్టి ఈ అంశాన్ని నిర్ధారించవలసి వుంటుంది.ఎ.పి, తెలంగాణ విభజన తర్వాత తమిళనాడుకే దక్షిణాదిన అత్యధికంగా 39 స్థానాలున్నాయి. దేశ వ్యాపితంగా చూస్తే అది అయిదో స్థానంలో వుంది. ఏకపక్షంగా పునర్విభజన జరిపితే 7,8 స్థానాలు తగ్గిపోతాయి. 11 వరకూ తగ్గొచ్చని మరో లెక్క కూడా వుంది. కొత్త పార్లమెంటులో 888 మంది సభ్యులకు చోటు కల్పించారు. కనుక పాత నిష్పత్తి ఫార్ములా చెల్లుబాటు కాదు. ఇదేగాక మరో సమస్య కూడా వుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పుడు వారికి రిజర్వు చేసిన మూడో వంతు స్థానాలను అదనంగా కలపాలని తీర్మానించారు. కనుక ఈ రెండు కోణాల్లోనూ సీట్ల సంఖ్య పెంచడమనేది కూడా కీలకాంశంగా వుంటుంది. దీనికి సహేతుకమైన పరిష్కారం కావాలంటే జనాభా దామాషాతో పాటు ఇతర ప్రోత్సాహక సూచికలు కూడా నిర్ణయించాలి. జనాభా ఎక్కువగా వుండటానికి చారిత్రిక కారణాలున్నాయి గనక ఆ ప్రాతిపదికన ఉత్తరాదికి తగ్గించడం సరికాదని ఆ పార్టీని బలపర్చేవారు వాదిస్తున్నారు. ఉత్తరాది నుంచి శ్రామికులు వచ్చి చౌకగా పనిచేయడం వల్లనే తమిళనాడు సంపద పెరిగిందని కూడా వారు వితండ వాదన చేస్తున్నారు. ఇప్పటికే స్వంత మెజార్టీ కోల్పోయిన బిజెపి రేపు మరింత తగ్గిపోకుండా ఉత్తరాది రాజకీయం నడుపుతున్నదా అని రాజకీయ పరిశీలకులు సందేహిస్తున్నారు. భారతదేశ సమైక్యత, సమతుల్యతను కాపాడుకోవడం రాష్ట్రాల హక్కులను సమాఖ్య రాజ్యాంగానుసారం కాపాడటం ఇందులో దాగి వున్నాయి. సీట్లు పైనే పెంచి దక్షిణాదికి గొర్రె తోకగా వుంచేట్టయితే అప్పుడు సమైక్యతా భావనకే విఘాతం కలుగుతుంది. విధాన నిర్ణయాలలోనూ సమతుల్యత దెబ్బ తింటుంది. ఇంకా మహిళల రిజర్వేషన్ కోసం సీట్ల పెంపు, లేదంటే జనాభా ప్రకారం పెంపు వంటి చర్యలు చేపడితే మరింత పకడ్బందీగా అడుగులు వేయవలసి వుంటుంది. దేశమంతటా ఒక ప్రధాన చర్చగా మారిన ఈ అంశంపై కేంద్రం విజ్ఞతతో నిర్ణయం తీసుకుని దేశ సమైక్యతను సమాఖ్య సూత్రాలనూ కాపాడవలసి వుంటుంది. లేకపోతే ఇది పెద్ద పోరాటంగా మారడం అనివార్యమే అవుతుంది.



# బిజెపి పునర్విభజన రాజకీయం !

దక్షిణాదిలో బిజెపి పెద్దగా పట్టు సాధించలేకపోతోంది. తమిళనాడు, కేరళలో అడుగు పెట్టడమే కష్టంగా ఉంది. గత దశాబ్దంగా ఎంతగా ప్రయత్నించినా ఒక్కసీటు సాధించడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలోలోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది.

అయితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరిగే బదులు తగ్గుతాయన్న ఆందోళన ఇప్పుడు దక్షిణాది నేతల్లో కలవరానికి గురి చేస్తోంది. 2011 జనాభా లెక్కలు తీసుకుంటే, అప్పటికీ ఇప్పటికీ దక్షిణాదిలో జనాభా తగ్గింది. ఈ లెక్కన సీట్లు పెరగాల్సింది పోయి తగ్గే ప్రమాదం ఉంది. ఇదే విషయమై ప్రధానంగా తమిళనాడు సిఎం స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పిల్లలను కనాలని నవదంపతులకు పిలుపునివ్వడం కూడా జరిగింది. రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు జరిపించాలి. మార్పులు చేర్పులను బట్టి చట్టసభల నియోజకవర్గాల సంఖ్యలు, హద్దులు సవరణలు చేయాల్సి వుంటుంది. ఎందుకంటే జనాభా అధికంగా వున్నా తక్కువగా వున్నా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటుకు ఒకే విలువ వుండాలి. ఎమర్జన్సీలో తెచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో నియోజకవర్గాల పునర్విభజన స్తంభింపచేశారు. ఆ సమయంలోనే జనాభా నియంత్రణపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టారు. జనాభాను తగ్గించే చర్యల కోసం రాష్ట్రాలను ప్రోత్సహించారు. అప్పటికి దక్షిణాది రాష్ట్రల్లో 6 నుంచి 10 శాతం పెరుగుదల వుంటే ఉత్తరాదిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, యు.పి, బీహార్ లలో 12 నుంచి 15 శాతం వుండింది. కనుక జనాభా నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలనీ ఇరవయ్యేళ్ల తర్వాతనే పునర్విభజన చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమయంలో జనాభా తగ్గితే సీట్లు తగ్గించడం సరికాదు గనక పార్లమెంటు స్థానాల సంఖ్యను 2001 వరకూ స్తంభింపచేశారు. అందువల్ల సీట్ల స్వరూపంలో అనేక మార్పులు జరిగినా మొత్తం ఎంపిల సంఖ్యలో మార్పు రాలేదు. సరిహద్దుల మార్పు తప్ప ఆ యా రాష్ట్రాల వారీగా వున్న సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా నియోజకవర్గాల పునర్వి భజన ప్రక్రియను 2026 వరకూ వాయిదా వేస్తూ 2002 రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చారు. దీంతో ఇప్పటి వరు ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో గందరగోళం చెలరేగుతోంది. ఉన్నసీట్లు తగ్గిస్తే తమకు పార్లమెంటులో పట్టు లేకుండా పోతోందన్న ఆందోళన మొదలయ్యింది. నిజానికి ఇదో కీలకమైన అంశం. విధాన నిర్ణయం కూడా. ఇలాంటి కీలకాంశాలపై పారదర్శకంగా సమగ్రంగా చర్చ జరగాలి. దక్షిణాది నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ కేంద్రం మాత్ర స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. ఏకపక్ష నిర్ణయాలు లేకుండా చూడడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఎలాగూ దక్షిణాదితో వచ్చే లాభం లేదు కనుక సీట్లు తగ్గిస్తేనే మంచిదన్న కుత్సిత ఆలోచన ఏదైనా ఉందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. అధ్యక్ష తరహాను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి బిజెపి యత్నిస్తోందని అనేక ఆరోపణలు సైతం ఉన్నాయి. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరగడానికి చర్యలు అవసరం. నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కల తర్వాత జరగాల్సిన పునర్విభజన అనేక కారణాల వల్ల సందేహాస్పదమై పోయింది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావలసిన పెరుగుదల రాదనీ స్టాలిన్ విమర్శ చేస్తున్నారు. అయితే హోం మంత్రి అమిత్ షా ఎవరి సీట్లూ తగ్గబోవని ప్రకటించారు. అసలు

పునర్విభజన ఏ ప్రాతిపదికపై జరుగుతుందో చెప్పాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గట్టిగా కోరుతున్నారు. దక్షిణాదిపై బిజెపి, కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అమిత్ షా హామీలను నమ్మలేమని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల నోరు నొక్కేందుకు పునర్విభజన అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే ఈ పునర్విభజన ఏ ప్రాతిపదికన జరుగుతుంది, ఇప్పుడున్న సీట్లు ప్రస్తుత జనాభా ప్రకారమే వుంటాయా అని ఆయన ప్రశ్నించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కూడా కేంద్రం అందరితో చర్చించి అడుగు వేయాలనీ, సందేహాలు తొలగించాలని వ్యాఖ్యానిం చారు. అయితే జమిలి ఎన్నికల బిల్లుతో ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతున్న వేళ ఈ ఆందోళనపై స్పష్టత రావాల్సి ఉంది. 1976 తర్వాత కాలంలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తర్వాత ఎ.పి, తెలంగాణలు జనాభా తగ్గింపులో గణనీయమైన ప్రగతిని సాధించాయి. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 2001 నాటికే 2.0గా వుంది. అంటే జనాభా స్థిరీకరణ దశకు చేరింద ని అంచనా వేశారు.

అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే 2026లో ఈ పక్రియ చేపట్టడం తథ్యంగా కనిపిస్తుంది. అయితే ఇప్పుడు కేవలం జనాభాను బట్టి సీట్లు నిర్ణయించేట్టయితే తక్కువ జనాభా వున్న దక్షిణాదిన సీట్లు తగ్గితే ఇప్పటికే చాలా ఎక్కువగా వున్న యు.పి, బీహార్ వంటి వాటికి ఇంకా పెరుగుతాయి. సగటు జనాభాను చూస్తే వేరే తేడాలుంటాయి. ఉదాహరణకు నాలుగు కోట్ల జనాభా వున్న తెలంగాణకు 17 లోక్‌సభ సీట్లున్నాయి. 12.6 కోట్ల జనాభా వున్న బీహార్‌కు 40 సీట్లున్నాయి. సగటున తెలంగాణకు 23 లక్షల మందికి ఒక సీటు వుంటే బీహార్‌లో సగటున 32 లక్షల మందికి ఒక సీటు వున్నట్టు లెక్క. అందులోనూ జనాభాను బట్టి దామాషా ప్రాతిపదికన పెంచేట్టయితే ఆ ఫార్ములాను బట్టి ఈ తేడా ఇంకా విపరీతంగా మారొచ్చు. సాంకేతికంగానేగాక రాజకీయంగానూ ఈ మార్పులకు చాలా ప్రభావం వుంటుంది. బిజెపి ఎన్నిఎత్తులు వేసినా దక్షిణాదిన స్వంతంగా అధికారంలోకి వచ్చేంతగా బలం పెంచుకోవడంలో సఫలం కాలేకపోయింది. కర్ణాటక మినహా ఇతర చోట్ల ప్రత్యక్ష, పరోక్ష మిత్రులపైనే ఆధారపడి వుంటున్నది. ఇలాంటి సమయంలో పునర్విభజన పేరిట ఉత్తరాదిన సీట్లు పెంచి దక్షిణాదిన తగ్గించేలా రాజకీయ ఎజెండాతో ముందుకు పోతుందా అన్న అనుమానాలు వస్తున్నాయి.


## వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు

### కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్: వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. తాజాగా ట్రంప్ కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ప్రసంగించారు. దాదాపు గంట 40 నిమిషాల పాటు ట్రంప్ ప్రసంగించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ సెషన్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఈ సెషన్‌లో భారత్, చైనా, కెనడా దేశాలపై సుంకాలు విధించనున్నట్లు స్పష్టం చేశారు. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి అమలులోకి రానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికాపై కొన్ని దేశాలు అధిక సుంకాలు విధిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్, చైనా బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు తమ నుంచి అధిక సుంకాలు వసూలు చేస్తున్నాయి. ఇది చాలా అన్యాయం అని ట్రంప్ చెప్పారు. భారత్ అమెరికాపై వంద శాతం కంటే ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుంది. ఇక అమెరికా వసూలు చేసే దానికంటే చైనా రెండింతలు ఎక్కువగా సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తాము కూడా సుంకాలు విధించేందుకు సిద్ధమయ్యామని ట్రంప్ తెలిపారు. ఏ దేశాలు.. తమ ఉత్పత్తులపై ఎంత టారిఫ్‌లు విధిస్తాయో.. తాము కూడా అంతే సుంకాల్ని వసూలు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. తన దేశం ఎదుర్కొంటోన్న ద్రవ్యోల్బణ సమస్య గురించి ప్రస్తావిస్తూ.. జో బైడెన్ పాలనలోని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చమురు, గ్యాస్ తవ్వకాల గురించి తన ఆలోచనలు వెల్లడించారు. ఏ దేశానికీ లేనివిధంగా మన కాళ్ల కింద ద్రవరూప బంగారం (చమురు, గ్యాస్‌ను ఉద్దేశించి) ఉందని, అది ద్రవ్యోల్బణ సమస్యను తీరుస్తుందని అన్నారు. 'ద్రవ్యోల్బణ సమస్యను పారదోలడం కోసం మేం చేసే పోరాటంలో భాగంగా ఇంధన వ్యయాన్ని వేగంగా తగ్గించడంపై దృష్టిపెట్టాం. బైడెన్ పాలనలో 100కు పైగా విద్యుత్ ఎ÷-లాంట్లు మూసివేశారు. వాటిలో చాలా ఎ÷-లాంట్లను మేం ఇప్పుడు తెరవబోతున్నాం. అందుకే నేను అధికారంలోకి రాగానే జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితిని విధించాను. మన కాళ్ల కింద బంగారాన్ని తోడటం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు.

# తమిళనాట హిందీ పేర్లు తొలగించండి

## ఎక్స్ వేదికగా సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు



కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాలన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే.. చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని భాజపా చెబుతోంది. అదే నిజమైతే.. దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు..?. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బ్జడెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా.. చేతల్లో చూపించండి' అని స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన పక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూడదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన పక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

# డ్రైనేజ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి: భాజపా

## వ్యవసాయ మార్కెట్లోకి రాకపోకలకు పూర్తి ఇబ్బందులు



**చౌటుప్పల్, మార్చి 06, (క్రైమ్ మిర్రర్ న్యూస్ ప్రతినిధి):** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ గేట్ ముందు అసంపూర్తిగా ఉన్న డ్రైనేజ్ నిర్మాణంను త్వరతిగతిన పూర్తిచేయాలని గురువారం స్థానిక బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక కాలనీల నుండి వస్తున్న మురుగునీరు సర్వీస్ రోడ్డు వెంట ప్రవహిస్తుండటంతో అట్టి ప్రదేశాన్ని బిజెపి నాయకులు సందర్శించారు. స్థానిక ప్రజలతో పాటు వాహనదారులకు, పాదచారులకు దుర్గంద వాసన రావడంతో పాటు దోమలు విపరీతంగా ఉత్పత్తి చెందుతున్నాయన్నారు. చౌటుప్పల్ పట్టణంలో డ్రైనేజీ నిర్మాణం పనులు నత్త నడకన నడుస్తున్నా పట్టించుకునే అధికారులు, ప్రజాప్రతినిధులు లేరన్నారు. మున్సిపల్ కమిషనర్ కు అనేకసార్లు విన్నపించుకన్న ఉపయోగం లేదని వాపోయారు. త్వరలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భనలో దూడల బిక్షం గౌడ్, రమణగోని శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, కడారి కల్పన, కైరంకొండ అశోక్, బత్తుల జంగయ్య గౌడ్, రిక్కల సుధాకర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, ఊడుగు వెంకటేశం గౌడ్, కట్ట కృష్ణ, దిండు భాస్కర్, పబ్బు వంశీ, కడారి ఐలయ్య, తేలుకుంట్ల శ్రీధర్, వనం ధనంజయ, సప్పిడి లింగారెడ్డి, బాతరాజు లింగస్వామి, దూసరి సన్ని, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





## పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**పిట్లం క్రైమ్ మిర్రర్:** పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల పిట్లంలో 51మంది పదవతరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు,పెన్నులను పంపిణీ చేశారు.పాఠశాల విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు మంచిగా రాయాలని,స్కూలుకు మంచి పేరు తేవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ కిషన్,అధ్యక్షులు కాశిరెడ్డి,కార్యదర్శి వేణుగోపాల్,కోశాధికారి బాలు, సభ్యులు ప్రమోద్ టీచర్,లక్ష్మీనారాయణ,రాజుసెట్, సంతోష్,బెజగం శేఖర్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైభవంగా యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

### గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు

**యాదాద్రి, (క్రైమ్ మిర్రర్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 6వ రోజు బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారు గోవర్ధనగిరిధారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సింహ వాహనంపై నరసింహుడు ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సృష్టిలోని సకల ప్రాణులపై తన దయాగుణాన్ని ప్రసరింపజేసి అపూర్వమైన తన లీలామహత్యాలతో పరిపూర్ణ అవతారంలో లక్ష్మీనృసింహుడు భక్తజనుల పూజలు అందుకుంటున్నాడు. కాగా దివ్యాలంకారాలతో చేతిలో పిల్లన గ్రోవితో తన లీలామృత మృధుమధుర గానంతో సమ్మోహన పరుస్తూ ఏకశిఖరవాసుడు మురళీకృష్ణుడిగా భక్తజనులకు దర్శనమిచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం స్వామివారు శ్రీకృష్ణ అలంకరణలో ప్రత్యేక సేవలు అందుకున్నారు. జగత్తులో మంచిని రక్షించి.. చెడును చెండాడి, చేసేది ఎవరైనా, చేయించేది నేనే అంటూ లోక జనులందరికీ జ్ఞానసంపదలు ప్రసాదించిన శ్రీ కృష్ణుడి అలంకరణలో నారసింహుడిని భక్తులు దర్శించి తరించారు. పల్లకిలో మంగళవాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరేగించారు. భక్తపారాయణుడు జగద్రక్షకుడు శ్రీ మహావిష్ణువు లోకకల్యాణం కోసం అవతరించిన అవతార రూపాల్లో లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో దివ్య వాహన సేవలు అందుకుంటున్నారు. బుధవారం రాత్రి స్వామి వారు పొన్నవాహన సేవపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్త జనులకు దర్శనమిచ్చారు. పొన్న చెట్టు నీడలో చిలిపి కృష్ణుడు చేసిన రాసలీలా వైభవాలు భాగవతంలో పేర్కొన్న రీతిలో వాహన సేవ ఆహ్లాదకరంగా నిర్వహించారు. పొన్నవృక్షంపై వాసుదేవ స్వరూపమని సకల భక్తులకు ఆశ్రయం కలిగించే వాహన సేవలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాలు ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీనకుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రమే?షబాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహే?షగౌడ్, ధీరావత రామరావునాయక్, రాజనబాబు, వాసం వెంకటేశ్వర్లు, దాసోజు నరేష్, రాకేష్ రెడ్డి, ముద్దసాని నరేష్, వేముల వెంకటేశ, ఉద్యోగ పాల్గొన్నారు.



# యువకుడి ఆత్మహత్య

**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ :** మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర గురువారం ఉదయం ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల సమాచారం మేరకు, మృతుడిని గంధం అరుణ్ కుమార్ (26)గా గుర్తించారు. నల్గొండ జిల్లా దామరచర్లకు చెందిన అరుణ్ కుమార్, అదే ప్రాంతంలోని నాగకృష్ణా పెట్రోల్ బంకులో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మార్చి 1న ఉదయం 9 గంటలకు విధులకు హాజరైన ఆయన, రెండు రోజుల పాటు బంకులో పనిచేసి, అనంతరం ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.అరుణ్ కుమార్ ఉరి వేసుకున్న విషయాన్ని ఆయన తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.





# ఎస్సీ రిజర్వేషన్ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన గోపి రజక

### మంత్రి ని శాలువాతో సన్మానించిన కేతూరి రవి

**హైదరాబాద్, మార్చి 06(క్రైమ్ మిర్రర్):** ఒకే దేశం ఒకే రాజ్యాంగం ఒకే కులం దేశవ్యాప్తంగా ఒకే వృత్తి చేస్తున్న రజక కులానికి ఒకే రిజర్వేషన్ ఉండాలి కాని భిన్న రిజర్వేషన్లు ఉండటం చాలా బాధాకరమని గోపి రజక అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్ లో గురువారం రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి మెమోరండం అందజేసిన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక,టిఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతూరి రవి , ఉపాధ్యక్షులు అక్కెనపల్లి గణేష్. ఈసందర్భంగా గోపి రజక మాట్లాడుతూ 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో రజకుల ఎస్సీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో మాట్లాడిన ఎనుముల రేవంత్ రెడ్డి నేడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కావున అసెంబ్లీలో బిల్లు పెట్టే విధంగా తమరు చొరవ తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని గోపి రజక కోరారు. మంత్రివర్యులు స్పందిస్తూ మెమోరండంలోని అన్ని విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

# తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

### సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్



**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ :** తెలంగాణలో నిరుద్యోగ యువత కోసం తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల అధ్యయనంలో భాగంగా నిర్వహించిన సర్వే సందర్భంగా ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వాల పొరపాట్లను పునరావృతం చేయకుండా, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రవినాయక్ కోరారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై యువతకు భారీ ఆశలు ఉన్నాయని, వాటిని భగ్నం కాకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా గ్రూప్-4, ఇతర గ్రూప్ పరీక్షలు, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు వంటి ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, వారికి తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రవినాయక్ అభిప్రాయపడ్డారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకపోతే కనీసం నెలకు రూ.10,000 నిరుద్యోగ భృతి అందించాలని సూచించారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఈ భృతి నిరుద్యోగ యువతకు కొంత ఊరట కలిగిస్తుందని ఆయన తెలిపారు.కొత్త ప్రభుత్వం నిరుద్యోగ యువత ఆకాంక్షలను తప్పక తీర్చాలి, అంటూ రవినాయక్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కోట్ల శ్రీనివాస్ రెడ్డి, ఆశీర్వాదం, సైదులు, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం

### ముసాయిదా బిల్లుకు తుది మెరుగులు దిద్దాలని సిఎం ఆదేశం

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని ముసాయిదా బిల్లుకు తుది మెరుగులు దిద్దాలని, న్యాయపర చిక్కులు లేకుండా చూడాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినేట్ భేటీ కొనసాగింది. మాల, మాదిగ, డక్కలి.. ఇలా తెలంగాణలో 59 ఎస్సీ కులాలు ఉన్నాయి. ఆ జాబితాలోని కులాలకు ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో కొంత శాతం వరకు రిజర్వేషన్ ఉంటుంది. తెలంగాణలో అది 15 శాతం ఉంది. అంటే వందలో 15 ఉద్యోగాలు ఈ కులాలకు చెందిన వారికే ఇస్తారు. అయితే, ఆ జాబితాలోని కులాల మధ్య కూడా అసమానతలు ఉన్నాయి. అందులో కొన్ని కులాలు ముందున్నాయి, మరి కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయని ఆయా కులాల వారు చెబుతూ వచ్చారు. దీనివల్ల ఎస్సీలకు మొత్తంగా ఇచ్చిన రిజర్వేషన్లను కొన్ని కులాలే ఉపయోగించుకుని ముందుకు వెళ్తున్నాయనీ, మిగతా వారు వెనుకబడే ఉంటున్నారనీ ఇతర కులాల వారు ఆరోపిస్తూ వస్తున్నారు. అందుకే ఎస్సీలకు ఇచ్చిన 15 శాతం రిజర్వేషన్‌ను తిరిగి, కులాల మధ్య విభజించి పంచాలనే డిమాండ్ వినిపించింది.




# ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఊరట

## మూడు కేసుల్లో నిర్దోషిగా తేల్చిన కోర్టు

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** మూడు కేసుల్లో రాజా సింగ్‌ను కోర్టు నిర్దోషిగా తేల్చింది. గతంలో విద్వేషపూరిత ప్రసంగం, ఎన్నికల ర్యాలీ, శ్రీరామ నవమి ర్యాలీ అనుమతి ఉల్లంఘనకు సంబంధించిన మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను విచారించిన నాంపల్లిలోని ప్రత్యేక కోర్టు బీజేపీ శాసనసభ్యుడు టి. రాజా సింగ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో ఈ కేసులు నమోదయ్యాయి. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై 2022లో పోలీసులు పీడీ యాక్ట్ పెట్టారు. 2022 ఫిబ్రవరి 19న మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసు ఆధారంగా పీడీ యాక్ట్ ప్రయోగించారు. అరెస్టు చేసి, చర్లపల్లి జైలుకు తరలించారు. రాష్ట్రంలోనే తొలిసారి ఒక ఎమ్మెల్యేపై పీడీ యాక్ట్ ప్రయోగించడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. మతపరమైన కామెంట్లు చేశారనే ఆరోపణలతో రాజాసింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ టైమ్?లో 41 సీఆర్‌పీసీ నోటీసులు ఇవ్వలేదని, సుప్రీంకోర్టు గైడ్?లైన్స్ పాటించలేదని రాజాసింగ్ రిమాండ్‌ను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. రాజాసింగ్ రిమాండ్ రిజెక్ట్ కావడంతో పోలీసులు లీగల్ ఒపీనియన్ తీసుకున్నారు. ఆయనపై లోగడ నమోదైన కేసులను కొత్తగా పరిశీలించారు. పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు అనుకూలంగా మంగళ్‌హాట్, షాహినాయత్ గంజ్ స్టేషన్లలో నమోదైన కేసులు గుర్తించారు. తాజాగా ఈ కేసుల్లో రాజా సింగ్ నిర్దోషిగా తేలారు.

# పాతబస్తీ బహద్దూర్‌పురలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** పాతబస్తీలోని బహదూర్‌పురాలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. లారీ మెకానిక్ వర్క్‌షాప్‌లో చెలరేగిన మంటలు సమీపంలోని చెట్లకు వ్యాపించాయి. దీంతో స్థానికుల తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. ఘటనకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలో కూడా ఇదే మెకానిక్ వర్క్‌షాప్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

# 10 నుంచి 'బీసీ' స్వయం ఉపాధి యూనిట్లకు దరఖాస్తుల స్వీకరణ

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అమరావతి,మార్చి6(ఆర్‌ఎన్‌ఎ): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినందున రాష్ట్రంలో అమలవుతున్న బీసీ సంక్షేమ పథకాల యూనిట్ల ఏర్పాటుకు లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత ,జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి గుంటూరు-కృష్ణా, ఉభయ గోదావరి పట్టభద్రులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గత నెల మూడో తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడం, ఫలితాలు కూడా వెలువడడంతో ఎన్నికల కోడ్ ముగిసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించినట్లు మంత్రి సవిత తెలిపారు. ఎన్నికల కోడ్ ఫలితంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలోనూ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాట్లకు దరఖాస్తుల స్వీకరణ నిలిపేశామన్నారు. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, కృష్ణా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన లబ్దిదారులంతా ఈ నెల పదో తేదీ నుంచి ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత ఆ ప్రకటనలో కోరారు.

# మెగా డిఎస్సీకి అనుగుణంగా ఉచిత కోచింగ్

## బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ: మంత్రి సవిత

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** మెగా డీఎస్సీ నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత ఆన్ లైన్ డీఎస్సీ కోచింగ్ ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ నెల 10 తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే 26 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు ఆన్ లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇంటి వద్ద నుంచే ఆన్ లైన్ ద్వారా డీఎస్సీ కోచింగ్ పొందవొచ్చునన్నారు. బీసీ, ఈబ్ల్యూఎస్ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులన్నారు. అభ్యర్థులు టెట్ లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంతమందికైనా ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణివ్వడానికి తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ జిల్లాలకు చెందిన జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులను సంప్రదించాలని ఆ ప్రకటనలో మంత్రి సవిత తెలిపారు.

# గోదాముల వద్ద సిసి కెమెరాల ఏర్పాటు


## రేషన్ బియ్యం స్మగ్లింగ్ పై ప్రత్యేక దర్యాప్తు ఆరా

## ఎపి పౌరసరఫరా శాఖ నాదెండ్ల మనోహర్

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** స్టాక్ పాయింట్లుగా ఉన్న బఫర్ గోదాముల్లో ఎఐ సిసి కెమెరాల ఏర్పాటు చేశామని ఎపి పౌరసరఫరా శాఖ నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్ పై ప్రత్యేక దర్యాప్తు బృందం పని చేస్తోందని అన్నారు. నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ.. 18 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ చేసేలా గోదాములు ఉన్నాయని, ప్రైవేటు గోదాముల్లో జరుగుతున్న అవకతవకలు బయటపడ్డాయని చెప్పారు. మచిలీ పట్నంలోని జెఎస్ గోదాముల్లో స్టాక్ తగ్గిందని గుర్తించి, రూ. 1. 70 కోట్లు జరిమానా కూడా వేశామని తెలియజేశారు. మరో రూ. 1.67 కోట్లు జరిమానా కట్టాలని నోటీసులు కూడా జారీ చేశామన్నారు.

# జైశంకర్ పర్యటనలో ఖలిస్తానీల కలకలం

## తీవ్రంగా ఖండించిన బ్రిటన్ విదేశాంగశాఖ



**లండన్,(క్రైమ్ మిర్రర్):** లండన్ పర్యటనలో ఉన్న భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఓ కార్యక్రమంలో పాల్గొని వస్తుండగా కొందరు ఖలిస్థానీ అనుకూలవాదులు చేసిన హంగామా తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనను బ్రిటన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. కేవలం శాంతియుత నిరసనలను అనుమతిస్తామని.. బెదిరింపు ధోరణి, అధికారిక కార్యక్రమాలకు ఆటంకం కలిగించే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని హెచ్చరించింది.'బ్రిటన్‌లో భారత విదేశాంగశాఖ మంత్రి పర్యటన సందర్భంగా ఛాతమ్ హౌస్ వద్ద చోటుచేసుకున్న ఘటనను ఖండిస్తున్నాం. శాంతియుత నిరసన హక్కును బ్రిటన్ సమర్థిస్తున్నప్పటికీ... బెదిరింపు ధోరణి, అధికారిక కార్యక్రమాలకు ఆటంకం కలిగించే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదు' అని బ్రిటన్ విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. అంతర్జాతీయ నియమాలకు అనుగుణంగా దౌత్యవేత్తలందరికీ రక్షణ కల్పించేందుకు తాము కట్టుబడి ఉన్నామని మెట్రోపాలిటన్ పోలీసులు పేర్కొన్నారు. లండన్‌లోని ఛాతమ్ హౌస్‌లో అధికారిక సమావేశాన్ని ముగించుకొని జైశంకర్ బయటకు వచ్చిన సమయంలో కొంతమంది ఖలిస్థానీ అనుకూల వ్యక్తులు అక్కడ కలకలం సృష్టించారు. తమ జెండాలతో నిరసన తెలుపుతుండగా.. ఓ దుండగుడు విదేశాంగ మంత్రి కారు వద్దకు దూసుకొచ్చాడు. భారత జాతీయ జెండాను చేత పట్టుకొని.. దాన్ని అవమానించేలా ప్రవర్తిస్తూ నినాదాలు చేశాడు.ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. వేర్పాటువాదులు, ఉగ్రవాదుల దుశ్చర్యలను, ప్రజాస్వామ్య స్వేచ్ఛ దుర్వినియోగం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. ఇటువంటి సందర్భాల్లో ఆతిథ్య దేశం తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నామని తెలిపింది. ఈ క్రమంలోనే యూకే విదేశాంగ నుంచి తాజాగా స్పందించింది.

# కాంగ్రెస్‌ను ఓడించేందుకు బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కు

## ఈ రెండు పార్టీల మధ్య లోపాయకారి ఒప్పందం

## మంత్రుల ఘాటు విమర్శలు



**హైదరాబాద్(క్రైమ్ మిర్రర్):** ఎమ్మెల్సీ కాంగ్రెస్‌ను ఓడించేందుకు బిజెపి, బిఆర్ఎస్ కుట్ర చేసిందని తెలంగాణ ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ఎమ్మెల్సి ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై గాంధీభవన్ లోఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసి రంజాన్ గిఫ్ట్ ఇచ్చాయా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కలిసి పని చేశాయని బిఆర్ఎస్ బలం అంతా పెట్టి బిజెపికి సపోర్ట్ చేసిందని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని ఆ రెండు పార్టీలు కలిసి ఓడించాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి రంజాన్ గిఫ్ట్ ఇచ్చామని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చానన్నారు. తాము బిజెపికి ఎన్నో గిఫ్టులు ఇచ్చామని, త్వరలోనే రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లడుతూ.. కాంగ్రెస్‌ను ఓడించడానికి భాజపా, భారాస కలిసి పనిచేశాయన్నారు. పట్టభద్రులకు నైపుణ్యాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేస్తున్నారని తెలిపారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా, భారాస రెండూ కలిసే కాంగ్రెస్‌ను ఓడించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఫలితాలపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'అభ్యర్థిని పెట్టకుండా భాజపాతో కలిసి భారాస కుమ్మకయ్యిందని అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకటే అని తేలిందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారిద్దరు ఎవరికి ఓటేశారో చెప్పాలి. తక్కువ ఓట్లతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఈ ఓటమిపై సమీక్షించుకుంటామని అన్నారు. ఇదిలావుంటే అంబర్‌పేటలో తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. నియోజకవర్గంలో బాగ్ అంబర్‌పేట, నల్లకుంట, బర్కత్‌పురా ప్రాంతాల్లో రూ.4.90 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపి కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, అంబర్ పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రోహిన్ రెడ్డి పలువురు నేతలు, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడారు?బిఆర్ఎస్ పాలనలో రాష్టంలో ఆర్థిక విధ్వసం జరిగిందని అన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకరించట్లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు కిషన్ రెడ్డి అడ్డొస్తున్నారని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

# బిజెపితో బిఆర్ఎస్ చీకటి ఒప్పందం

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బయటపడిందన్న మల్లు రవి

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** గెలుపునకు మేమందరం బాధ్యత తీసుకున్నాం.. ఓటమి కూడా సమిష్టి బాధ్యత అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. బీజేపీ- బీఆర్ఎస్ పార్టీల చీకటి ఒప్పందంలో భాగంగా బీఆర్ఎస్ పూర్తిగా బీజేపీ అభ్యర్థులకు సపోర్ట్ చేసిందని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ హవా చూపిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సభ్యుల ఓటమిపై ఎంపీ మల్లు రవి ఢిల్లీలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవక పోగా, డిపాజిట్లు పోగొట్టుకున్నారని విమర్శించారు. బీజేపీ ఎమ్మెల్సీల సంఖ్య 3 కు పెరిగిందని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి, ప్రజలకు ఒరిగేది ఏం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఫలితాలు చూపించి సంబురాలు చేస్తుంటే, ఆశ్చర్యంగా ఉందన్నారు. 'బీఆర్ఎస్ నేతలపై ఉన్న కేసుల విషయంలో భయపెట్టి, రహస్య ఒప్పందం చేసుకున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇతర ఎన్నికలకు సంబంధం ఉండదు. స్థానిక సంస్థల ఎన్నికలకు, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధం లేదు. రెండు సీట్లు రాగానే, బండి సంజయ్, కిషన్ రెడ్డిలు అన్ని మేమే గెలుస్తాం అంటున్నారు. ఇప్పుడు ఎన్నికలు పెడితే 100 సీట్లల్లో కాంగ్రెస్ గెలుస్తుంది. ఎమ్మెల్యేల కోటాలో కచ్చితంగా సామాజిక న్యాయం ఉంటుంది. ఇన్‌ఛార్జీలు ఎవరు వచ్చినా అందరిది కాంగ్రెస్ సిద్ధాంతమే. గాంధీ సిద్ధాంతాలను మీనాక్షి నటరాజన్ అనుసరిస్తున్నారు.' అని ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు.

# సొరంగంలో సహాయక చర్యలు ముమ్మరం

## మృతులను గుర్తించేందుకు కేరళ జాగిలాలు

**నాగర్ కర్నూలు,(క్రైమ్ మిర్రర్):** నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో చిక్కుకుపోయిన 8 మంది జాడను గుర్తించేందుకు సహాయక చర్యలు వేగవంతమయ్యాయి. ఇందుకోసం కేరళ నుంచి ఆర్మీ హెలికాప్టర్లలో రెండు క్యాడవర్ జాగిలాలను తీసుకువచ్చారు. కేరళ ప్రత్యేక పోలీసు బృందం, జిల్లా కలెక్టర్ సంతోష్.. విపత్తు నిర్వహణ అధికారులతో సమావేశమయ్యారు. 8మంది చిక్కుకున్న ప్రాంతాలపై ప్రాథమిక అంచనాలు వేస్తున్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సమస్యాత్మకంగా మారిన బురద, మట్టిని తొలగించేందుకు అధికారులు తొలిసారి వాటర్ జెట్‌లను వినియోగిస్తున్నారు. సొరంగంలో చిక్కుకుపోయిన వారిని కనుగొనేందుకు అధికారులు 13 రోజులుగా చేస్తున్న కృషి ఫలించడం లేదు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైన్స్, హైడ్రా తదితర ఏజెన్సీల నిపుణులు బురద తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు. ఫలితం తేలకపోవడంతో తొలిసారిగా వాటర్ జెట్‌లను వినియోగిస్తున్నారు. టన్నెల్ బోరింగ్ మిషిన్(టీబీఎం)పైన, చుట్టుపక్కల పేరుకుపోయిన బురదపై వీటితో నీటిని పంప్ చేస్తున్నారు.మరోవైపు సొరంగంలో ప్రమాదకరంగా ఉన్న షీర్‌జోన్ ప్రాంతంలో రోబోల సేవలను వినియోగించే అవకాశాన్ని పరిశీలించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఎన్‌వీ రోబోటిక్స్ ప్రతినిధుల బృందం టన్నెల్‌ను సందర్శించింది. సీఎం రేవంత్‌రెడ్డి టన్నెల్‌ను సందర్శించిన సమయంలో అవసరమైతే రోబోలను వినియోగిస్తామని ప్రకటించారు. ఈ మేరకు రోబోటిక్స్ సంస్థ ప్రతినిధులు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.

# భూపాలపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచారం

## ఆందోళనలో స్థానిక ప్రజానీకం

## చిరుత సంచారాన్ని ధృవీకరించని అటవీశాఖ



**జయశంకర్ భూపాలపల్లి,(క్రైమ్ మిర్రర్):** వామ్మో.. పులి సంచరిస్తోందంటూ జిల్లాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఎక్కడిదో వీడియో తెలియదుకానీ సోషల్ మీడియాలో మాత్రం వైరల్ అవుతోంది. గోరుగత్తుపల్లి శివారులోని బొక్కిచెరువు సమీపంలో చిరుత పులి సంచరిస్తుందని పుకార్లు జోరందు కున్నాయి. మొక్కజొన్న చేను వద్ద చిరుత పులి తిరుగుతున్న వీడియోను ఓ మహిళ రికార్డు చేసిందంటూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం పులి పాదముద్రలు గుర్తించాకే స్పష్టత ఇస్తామని చెబుతున్నారు. స్థానికులు మాత్రం చిరుత పులి వార్తలపై ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా చిరుత సంచారం వార్త జిల్లాలో తీవ్రం భయాందోళనకు గురిచేస్తోంది.అయితే జిల్లాలో గత 15 రోజులుగా పులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. అయితే ఓ చోట కనిపించిందంటూ అటవీ అధికారులకు సమాచారం అందడం, వారు అక్కడకు చేరుకుని పాదముద్రలు గుర్తించేలోగా వేరే ప్రదేశానికి వెళ్లిపోవడం జరుగుతూ వస్తోంది. గత పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది జిల్లాలో. ఈ క్రమంలో గోరుగత్తుపల్లికి సంబంధించిన ఓ వీడియో మాత్రం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్‌గా మారింది. ఆ గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు ఈ వీడియోను చిత్రీకరించినట్లు చెబుతున్నారు. మొక్కజొన్న చేను గట్టుపై నుంచి చిరుత వెళ్తున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. అయితే ఈ వీడియోను చూసిన అటవీ శాఖ అధికారులు మాత్రం.. పులి సంచారాన్ని ఇంకా ధృవీకరించలేదు. ఆ ప్రాంతానికి వెళ్లి అక్కడ పులి పాదముద్రలు గుర్తించాకే నిర్ధారిస్తామని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. అయితే వీడియో తమ ఊరిదే అని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు కన్ఫామ్ చేస్తున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు మాత్రం నిర్ధారించడం లేదు. గత మూడు వారాలుగా ఈ ప్రాంతంలో పులి సంచరిస్తోంది. భూపాలపల్లి జిల్లాలోని మహాదేవ్‌పూర్, కాటారం అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తూ.. వరంగల్ జిల్లా నల్లబెల్లి, మహబూబాబాద్ జిల్లా గంగారం వరకు వెళ్లి అదే పులి తిరిగి వస్తోందన్నది అక్కడి వారు చెబుతున్నారు. పులి సంచారంపై స్థానికులు మాత్రం తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో పులి సంచారం ఉంది, అటువైపు వెళ్లవద్దని డప్పు చాటింపు వేయిస్తున్నారు. అలాగే అడవిలోకి వెళ్లే రైతులు, పశువులకాపర్లు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరం

### ఘటనలపై పూర్తిస్థాయి విచారణ : మంత్రి నారా లోకేశ్



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** విద్యాసంస్థల్లో పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని మంత్రి లోకేశ్ అన్నారు కళాశాల విద్యార్థుల ఆత్మహత్యలపై శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. వారి ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇచ్చారు. పలు సమస్యలతో పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ర్యాగింగ్, ఒత్తిడి, ఫీజుల చెల్లింపు వల్ల ఎక్కువగా పిల్లలు ఆత్మహత్యలకు కారణాలవుతున్నాయన్నారు. పాఠశాల విద్యలోనూ మానసికంగా వేధిస్తున్నారనే అంశాలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి నారా లోకేష్ తెలిపారు.స్కూళ్లలో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నామని నారా లోకేష్ అన్నారు. పిల్లల్లో విద్యాపరంగా ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం చాలా సీరియస్‌గా భావిస్తుందని పేర్కొన్నారు. ఆత్మహత్యలపై నివారణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలపైనా ఉందని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు 12 లక్షల మంది పిల్లలు దూరమయ్యారని అన్నారు. చాలా మంది ప్రైవేటు విద్యా సంస్థలవైపు వెళ్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, టీచింగ్ స్టాఫ్ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# గంజాయి మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం

### రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చుతాం : హోంమంత్రి వంగలపూడి అనిత



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** గంజాయి మాదక ద్రవ్యాల వినియోగంలో కూటమి ప్రభుత్వం సహించేదే లేదని హోంమంత్రి వంగలపూడి అని అన్నారు. ఏపీ శాసమండలిలో మాదక ద్రవ్యాల వినియోగంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. గంజాయిపై ఉక్కు పాదం మోపుతామని మొట్టమొదటి టార్గెట్‌గా పెట్టుకొని ముందుకు వెళ్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గంజాయి నియంత్రణ కోసం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో సీఎం ఇంటి దగ్గరే గంజాయి తాగి అత్యాచారం చేస్తే కనీసం నిందితులను గుర్తించే పరిస్థితి లేకుండా ఉన్నాయని మండిపడ్డారు. 2021 దేశ వ్యాప్తంగా 7 లక్షల 40 వేల గంజాయి దొరికితే అందులో 2 లక్షల గంజాయి ఏపీలో పట్టుపడిందని వెల్లడించారు. డ్రోన్ కార్పొరేషన్‌తో డ్రోన్‌లు వాడకం తీసుకొచ్చామని తెలిపారు. డ్రోన్ వస్తే పోలీసులు వస్తారని అనేక ప్రాంతాల్లో స్వయంగా గంజాయి పండిస్తున్న వాళ్లే ధ్వంసం చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. గంజాయి సాగు అనేది 90% వరకు తగ్గిపోయిందని తెలిపారు. నార్కోటిక్ చట్టం ప్రకారం సాగు చేసిన, అమ్మిన, దానిని ప్రేరేపించిన, దానిని ఉపయోగించిన గంజాయి విషయంలో కఠినమైన చట్టాలు ఉన్నాయన్నారు. అనేక మంది వెనుకబడిన వర్గాల పిల్లలు ఈ కేసుల్లో ఇరుక్కున్న మాట వాస్తవమన్నారు. అన్ని డిపార్ట్‌మెంట్లలో గంజాయి నియంత్రణపై కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి నియంత్రణలో భాగంగా ఆస్తులు జప్తు కూడా చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి కొకైన్ కేసు కూటమి ప్రభుత్వంలో కాదని.. 2021లో వైజాగ్‌లో మూడు గ్రాములకు సంబంధించి కొకైన్ కేసు నమోదు జరిగిందని చెప్పారు. 2025లో గుంటూరులో కొకైన్ కేసు నమోదు చేశామన్నారు. డ్రగ్ కంట్రోల్.. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లతో కోఆర్డినేషన్ చేస్తున్నామన్నారు. గంజాయికి అలవాటు పడిన వారిని మత్తు పదార్థాలకు బానిసలైన వారిని డీ అడిషన్ సెంటర్లకు పంపిస్తున్నామన్నారు. ఏపీలో సాగు తగ్గిన తర్వాత ఒడిస్సా నుంచి ఏపీకి ఎక్కువగా ట్రాన్స్‌పోర్టు అవుతుందన్నారు. 70 వేల కిలోల గంజాయిని ఒడిస్సా నుంచి వస్తున్న నేపథ్యంలో పట్టుకోవడం జరిగిందని.. దానిని స్మాష్ చేయడం జరిగిందన్నారు. ఒడిస్సా ప్రభుత్వంతో కూడా ఒక కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ, తమిళనాడు ప్రభుత్వాలతో కూడా కోఆర్డినేషన్ మీటింగ్లు ఏర్పాటు చేస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

## శ్రీవారి అన్నప్రసాదంలో మసాలవడ

### లాంఛనంగా ప్రారంభించిన టీటీడి



**తిరుమల,(క్రైమ్ మిర్రర్):** శ్రీవారి దర్శనానికి తిరుమలకు వెళ్లే భక్తులు అన్నప్రసాదాన్ని మహా ప్రసాదంగా స్వీకరిస్తారు.. ఇప్పుడు శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం మరో శుభవార్త చెప్పింది.. తిరుమలలో భక్తులకు ఉచితంగా అందించే అన్నప్రసాదంలో మసాలా వడను చేర్చింది. తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు వడ ప్రసాదం అందించే కార్యక్రమాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఇప్పటికే శ్రీవారి అన్నప్రసాద మెనులో మసాలా వడను చేర్చింది టీటీడీ.. అవి ఇప్పటి వరకు కొంతమందికే అందుతుండగా.. గురువారం నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చారు..ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. తాను టీటీడీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, అన్నప్రసాద మెనూలో భక్తులకు అదనపు వస్తువును వడ్డించే ఆలోచనను ముందుకు తెచ్చాను అన్నారు.. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినప్పుడు, ఆయన ఆ ఆలోచనకు అంగీకరించి ఆమోదించారని గుర్తుచేసుకున్నారు.. ఆలయ నిర్వహణలో ఇప్పటికే అధిక నాణ్యత గల పదార్థాలతో భక్తులకు అన్నప్రసాదాలను అందిస్తున్నట్లు తెలియజేశారు. భక్తులకు వడ్డించే వడల తయారీలో పప్పు, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, కొత్తిమీర, పుదీనా మరియు సోంపులను ఉపయోగిస్తారని వెల్లడించారు.. అన్న ప్రసాద కేంద్రంలో ప్రతిరోజూ ఉదయం 10.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు సుమారు 35,000 వడలను భక్తులకు వడ్డిస్తారని.. భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింత పెంచుతామని పేర్కొన్నారు..ఇక, ఇదే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ వెల్లడించారు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు.. తాను టీటీడీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించాక అన్నప్రసాదం మెనూలో అదనంగా ఒక పదార్థం పెట్టాలని ఆలోచన నాకు కలిగింది.. నా ఆలోచనను సీఎం దృష్టికి తీసుకెళ్లాను, ఆయన అంగీకారంతో.. గారెలను ఇవాళ ప్రవేశపెట్టాం.. నాణ్యమైన దినుసులతో భక్తులకు రుచికరమైన అన్నప్రసాదాలను మా అధికారులు వడ్డిస్తున్నారు.. ప్రతీ రోజు ఉదయం 10:30 నుండి సా 4 గంటల వరకు ప్రతిరోజు 35 వేల గారెలను భక్తులకు వడ్డిస్తాం.. భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింతగా పెంచి, భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తామని ఎక్స్ లో పేర్కొన్నారు.

# గాయనిని పెళ్లాడిన ఎంపీ తేజస్వీ సూర్య



న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీల్లో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివాడు అయ్యాడు. చెన్నైకి చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను మను వాడారు. వీరి వివాహం బెంగళూరులో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ నేతలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు, పలువురు నేతలు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. శివశ్రీ శాస్త్ర యూనివర్సిటీ నుంచి బయో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. మద్రాస్ యూనివర్సిటీ నుంచి భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత కాలేజీలో సంస్కృతంలో ఎంఏ పట్టా పుచ్చుకున్నారు. పొన్నియిన్ సెల్వన్ పార్ట్ -2లో కన్నడ వర్షన్‌లో శివశ్రీ ఓ పాట ఆలపించారు. ఆమె యూట్యూబ్ చానెల్‌కు 2 లక్షల మందికిపైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు.

# మనదేశ చరిత్రను వక్రీకరించారు

### దేశానికి న్యాయం జరిగేలా చేయలేదు


### ప్రపంచచరిత్ర పుస్తకావిష్కరణలో నిర్మలా సీతారామన్

### పుస్తకం కోసం బాగా అధ్యయనం చేసానన్న దగ్గుబాటి



**విశాఖపట్నం,(క్రైమ్ మిర్రర్):** చరిత్ర అనేది ఒక సముద్రం అని... తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర, అనే పుస్తక , తెలుగు ఇంగ్లీష్ వెర్షన్ ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. పుస్తకంలో కొన్ని అంశాలను చదివానని.. ప్రపంచ చరిత్రను క్రోడీకరించి సమగ్రంగా రాశారని తెలిపారు. గతంలో చరిత్ర రాసిన వాళ్ళు దేశానికి న్యాయం జరిగేలా రాయలేదని.. దేశంపై ఆధిపత్యం చలాయించిన వాళ్ళు తమకు అనుకూలంగా చరిత్రను రాసుకునే ప్రయత్నం జరిగిందని అన్నారు. జరిగినవి జరిగినట్టుగా రాయగలిగే ఆత్మవిశ్వాసం ఉండాలన్నారు. జరిగిన చరిత్రను జరిగినట్టు చెప్పాల్సిన సంస్కృతి మనదని చెప్పుకొచ్చారు. చరిత్రకారులు వారి ఆలోచనలకు అనుకూలంగా చరిత్రను రాశారు కానీ.. వాస్తవాలు వెలుగులోకి తీసుకురాలేదని తెలిపారు. చరిత్రను వక్రీకరించి రంగు పులిమే కార్యక్రమం పాశ్చాత్య దేశాల్లో కూడా జరిగిందన్నారు. ఓకిజం అనేది అమెరికాలో జరిగిందని.. ఇప్పుడు ట్రంప్ వచ్చాక ఓకిజం లేదంటే అందులో అర్థం ఏముందని అన్నారు. ఆఫ్టర్ ట్రంప్ వరల్డ్ హిస్టరీ ఇన్ డిఫరెంట్.. దానిపై కూడా అధ్యయనం చేయాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కుటుంబమంతా రాజకీయంగా, సామాజికపరంగా విజయాలు సాధించిన కుటుంబమని... ఈ పుస్తకం ఆవిష్కరణ ద్వారా మరో విజయాన్ని సాధించగలరని కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ పేర్కొన్నార్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి మాట్లాడుతూ.. ప్రపంచ చరిత్ర పుస్తకంలో.. చేయాలని లోతుగా అధ్యయనం చేసి అందులో కొన్ని అంశాలను మాత్రమే 340 పేజీల్లో రాసినట్లు తెలిపారు. ఆది నుంచి నేటి వరకు టెక్నాలజీతో సహా అన్ని అంశాలను, ఇందులో క్రోడీకరించానని అన్నారు. తాను వేదికపై ఎక్కి 30 సంవత్సరాలయిందని.. రాజకీయాల్లో ఉన్నా పుస్తకాలు రాస్తారా అని చాలామందికి అనుమానం ఉంటుందని.. చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని అడిగారన్నారు. ఇప్పటికీ నాలుగు పుస్తకాలు రాశానని.. ఇది ఐదో పుస్తకమని.. దీన్ని మాత్రం తాను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో టెక్నాలజీ ద్వారా 50 ఏళ్లు బ్రతకొచ్చు అంటున్నారని.. చంద్రబాబు 50 సంవత్సరాలు అంటే మీ అబ్బాయి బాధపడతాడేమో అంటూ చలోక్తులు వేశారు దగ్గుబాటి. 'చాలామంది చంద్రబాబుకు నాకు విభేదాలు అంటారు.. ఒకప్పుడు గతంలో ఉండేవి.. ఇది నిజం. కాలంతో పాటు మనం మారాలి. భవిష్యత్తు అనేది ఆశాజనకంగా ఉండాలి. నాకు కోరిక లేవు.. కుటుంబం ఆత్మీయులతో సరదాగా ఉండాలి.

# రెచ్చగొట్టే చర్యలను ఖండిస్తున్నాం : భారత్



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లండన్ పర్యటనలో భారీ భద్రతా వైఫల్యం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆయనపై ఖలిస్థానీ సానుభూతిపరులు దాడికి యత్నించడం కలకలం రేపుతోంది. ఈ అంశంపై భారత్ తాజాగా స్పందించింది. భద్రతాలోపంపై విదేశాంగ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. రెచ్చగొట్టే చర్యలను ఖండిస్తూ.. గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'విదేశాంగ మంత్రి జైశంకర్ యూకే పర్యటనలో చోటు చేసుకున్న భద్రతా ఉల్లంఘన ఫుటేజీని మేం చూశాము. వేర్పాటువాదులు, తీవ్రవాదుల రెచ్చగొట్టే చర్యలను, ప్రజాస్వామ్య స్వేచ్ఛ దుర్వినియోగం కావడాన్ని మేం త్రీవంగా ఖండిస్తున్నాము. ఇలాంటి సందర్భాల్లో ఆతిథ్య దేశం వారి దౌత్యపరమైన బాధ్యతలను పూర్తిగా నెరవేర్చాలి. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుంటుందని మేం ఆశిస్తున్నాం' అని ప్రకటనలో పేర్కొంది. కాగా, జై శంకర్ ఈనెల 4న యూకే పర్యటకు వెళ్లిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పర్యటనలో భాగంగా 9వ తేదీ వరకూ అక్కడే ఉండనున్నారు. ఈ నేపథ్యంలో పలు సమావేశాలకు హాజరవుతున్నారు. బుధవారం రాత్రి లండన్‌లోని ఛాతమ్ హౌస్ లో నిర్వహించిన అధికారిక సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశాలు ముగించుకొని బయటకు వచ్చిన సమయంలో కొందరు ఖలిస్థానీ అనుకూల వ్యక్తులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఖలిస్థానీ జెండాలను ప్రదర్శిస్తూ భారత్, కేంద్ర మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ గుంపులోని ఓ వ్యక్తి భారత జెండాను చేత పట్టి మంత్రి కారుకు అత్యంత సమీపంలోకి దూసుకొచ్చాడు. జాతీయ జెండాను అవమానించేలా ప్రవర్తించాడు. అప్రమత్తమైన లండన్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. కారువైపు దూసుకొచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# మూడు దశాబ్దాల తరవాత ఒకే వేదికపై తోడళ్లుల్లు

### పరస్పరం ఆలింగనం చేసుకున్న బాబు, దగ్గుబాటి



**విశాఖపట్నం,(క్రైమ్ మిర్రర్):** తోడల్లుళ్లు సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు దాదాపు 3 దశాబ్దాల తర్వాత ఒకే వేదికపైకి వచ్చారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమం విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో జరిగింది. దీనికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు మాట్లాడిన అనంతరం చంద్రబాబు ఆయన్ను అభినందిస్తూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. చంద్రబాబు, దగ్గుబాటి కొన్నేళ్లుగా కుటుంబ కార్యక్రమాల్లో కలుస్తున్నా.. ఇద్దరూ ఒకే బహిరంగ వేదికపైకి రావడం 30 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం విశేషం.

# తమిళనాడు డిప్యూటీ సీఎంకు సుప్రీంకోర్టులో ఊరట

### ఉదయనిధి స్టాలిన్‌పై కేసు నమోదు చేయొద్దని ఆదేశాలు




**చెన్నై,చండీఘడ్,(క్రైమ్ మిర్రర్):** డీఎంకే నేత, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీంకోరు ఊరట కల్పించింది. సనాతన ధర్మంపై ఆయన చేసిన వ్యాఖ్యలకు గానూ కొత్త కేసులు ఏవీ నమోదు చేయొద్దని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. కాగా, 'సనాతన ధర్మం'పై ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, పలువురు తీవ్రంగా తప్పుపట్టారు. ఇక ఆయన వ్యాఖ్యలపై దేశావ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అనేక ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదయ్యాయి. తాజాగా బీహార్‌లో ఇదే అంశంపై మరో కేసు నమోదైంది. దీంతో ఉదయనిధి స్టాలిన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వివిధ రాష్ట్రాల్లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఏకీకృతం చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సనాతన ధర్మం అంశంలో కోర్టు అనుమతి లేకుండా ఉదయనిధి స్టాలిన్‌పై కొత్త కేసులు ఏవీ నమోదు చేయొద్దని ఆదేశించింది. 2023లో చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. "సనాతన ధర్మం' డెంగీ, మలేరియా లాంటిది. దాన్ని నిర్మూలించాలి' అంటూ వ్యాఖ్యానించారు.



# ‘షమీ పాపం చేశాడు’

## మౌలానా షాహబుద్దీన్ వివాదాస్పద వ్యాఖ్యలు

బరెలీ(యూపీ): టీమ్ఇండియా క్రికెటర్లను లక్ష్యంగా చేసుకుంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. ఇటీవలే కెప్టెన్ రోహిత్‌శర్మపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి శమా మహమ్మద్ నోరు పారేసుకోగా, తాజాగా మహమ్మద్ షమీ కూడా లక్ష్యమయ్యాడు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస నిబంధనలు ఉల్లంఘిస్తూ షమీ తప్పు చేశాడని ఆల్‌ఇండియా ముస్లిం జమాత్ మౌలానా షాహబుద్దీన్ రజ్వీ మీడియాతో అన్నాడు. మంగళవారం ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో షమీ నీళ్లు తాగడాన్ని మౌలానా తీవ్రంగా తప్పుబట్టాడు. ‘షరియత్ చట్టం ప్రకారం తప్పు చేసిన షమీ నేరస్థుడు. రంజాన్ మాసంలో ఉపవాసాన్ని అతిక్రమించడం చాలా తప్పు. అలా ఎవరైనా చేస్తే ఇస్లామిక్ లా ప్రకారం పాపాత్ముడు అవుతాడు. క్రికెట్ ఆడటాన్ని తప్పుబట్టడం లేదు, కానీ మత నిబంధనలు కచ్చితంగా ఫాలో కావాల్సిందే’ అని వీడియోలో పేర్కొన్నాడు.

# నేటి నుంచి సన్‌రైజర్స్ తొలి రెండు మ్యాచ్‌ల టికెట్లు అమ్మకం...

## ఉదయం 11 గంటల నుంచి district app% లో విక్రయం

హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సొంతగడ్డపై ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు సంబంధించి టికెట్లను ఈరోజు ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. ఈనెల 23న ఉప్పల్ స్టేడియంలో జరిగే తమ తొలి లీగ్ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టుతో సన్‌రైజర్స్ ఆడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం గం. 3:30 నుంచి జరుగుతుంది. అనంతరం ఈనెల 27న ఉప్పల్ స్టేడియంలోనే జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో సన్‌రైజర్స్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌ను రాత్రి గం. 7:30 నుంచి నిర్వహిస్తారు. ఈ రెండు లీగ్ మ్యాచ్‌లకు సంబంధించి టికెట్లను ఈరోజు ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ మ్యాచ్‌ల అధికారిక టికెటింగ్ పార్ట్‌నర్ districtappలో district.in వెబ్‌సైట్‌లో ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు.

# తల్లి కాబోతున్న వినేశ



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ తల్లి కాబోతున్నది. ఈ విషయాన్ని తన భర్త సోమ్‌వీర్ రాఠితో కలిసి గురువారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. 2018లో సోమ్‌వీర్‌ను పెండ్లి చేసుకున్న వినేశ్ తన సంతోషాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో షేర్ చేసుకుంది. పారిస్(2024) ఒలింపిక్స్‌లో అనూహ్య రీతిలో కెరీర్‌కు వీడ్కోలు పలికిన వినేశ్ ‘కొత్త చాప్టర్‌తో మా ప్రేమాయణం కొనసాగుతోంది’ అని రాసుకొచ్చింది. రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికిన వినేశ్..కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే.

# ఆపద్బాంధవుడు అక్షర్



దుబాయ్: పదకొండేండ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసినా ఏడాదిన్నర క్రితం వరకూ రవీంద్ర జడేజా నీడన మరుగున పడిపోయిన స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్.. ఇప్పుడు అతడి వారసుడిగా ఎదగడమే కాకుండా మిడిలార్డర్‌లో జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. సాధారణంగా ఈ స్థానంలో అద్భుతమైన రికార్డు కలిగిన కేఎల్ రాహుల్‌ను వెనక్కి జరిపి మరీ అక్షర్‌ను ముందుకు పంపడం సాహసమే అయినప్పటికీ తనకు అప్పజెప్పిన బాధ్యతలకు అతడు వంద శాతం న్యాయం చేస్తున్నాడు.

పంత్ వైఫల్యంతో టాపార్డర్‌లో ఎడమ చేతివాటం బ్యాటర్ లేకపోవడం జట్టు కూర్పును దెబ్బతీస్తున్న తరుణంలో మేనేజ్‌మెంట్.. ఆ సమస్యకు అక్షర్ రూపంలో చెక్ పెట్టేందుకు ఈ ప్రయోగం చేసింది. గత నెలలో ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు.. 52, 41 నాటౌట్, 13తో మేనేజ్‌మెంట్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆ అవకాశాన్ని రెండు చేతులా సద్వినియోగం చేసుకున్నాడు. తాజాగా చాంపియన్స్ ట్రోఫీలోనూ అక్షర్.. అటు బంతితో పాటు బ్యాట్‌తోనూ అంచనాలకు మించి రాణిస్తూ మిడిలార్డర్ కష్టాలకు చెక్ పెడుతున్నాడు.

**ఆ ధైర్యంతోనే..**

వాస్తవానికి 2014లోనే భారత్ తరఫున వన్డేలలో ఎంట్రీ ఇచ్చిన అక్షర్‌కు జడేజా నీడలో సరైన గుర్తింపు రాలేదు. జడ్డూ లాగే స్లో లెఫ్టార్మ్ స్పిన్, లోయరార్డర్‌లో బ్యాటింగ్ చేసే అక్షర్.. 2022లో వెస్టిండీస్‌తో బార్బడోస్‌లో జరిగిన మ్యాచ్‌తో తన బ్యాటింగ్ స్కిల్స్‌ను ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆ మ్యాచ్‌లో అక్షర్.. 66 బంతుల్లో 3 బౌండరీలు, ఐదు భారీ సిక్సర్లతో 64 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వన్డేలలో అతడికి అదే తొలి అర్ధ సెంచరీ. ఈ ఇన్నింగ్స్‌తోనే తాను ఫినిషర్ కాగలనన్న ధైర్యం వచ్చిందని అక్షర్ గతంలో ఓసారి వ్యాఖ్యానించాడు. దీంతో గతేడాది శ్రీలంకతో వన్డే సిరీస్‌లోనే అక్షర్.. ఐదో స్థానానికి ప్రమోట్ అయ్యాడు. ఆ సిరీస్‌లో 33, 44 స్కోర్లతో ఫర్వాలేదనిపించాడు. ఇక ఇంగ్లండ్ సిరీస్‌లో అగ్రెసివ్ బ్యాటింగ్‌తో అతడు ఆడిన తీరుకు కోచ్ గంభీర్, సారథి రోహిత్ ఫిదా అయ్యారు. రాహుల్‌ను వెనక్కి నెట్టడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చినా వాటిని లెక్కచేయకుండా అక్షర్‌ను ప్రమోట్ చేసి విమర్శలకు ఆటతీరుతోనే చెక్ పెడుతున్నారు.

**నిఖార్సైన ఆల్‌రౌండర్**

చాంపియన్స్ ట్రోఫీ తొలి రెండు మ్యాచ్‌లలో పెద్దగా బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోయినప్పటికీ న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో 30 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయిన తరుణంలో శ్రేయాస్ అయ్యర్‌తో కలిసి అక్షర్ భారత ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. రోహిత్, గిల్, కోహ్లీ వంటి స్టార్ బ్యాటర్లు విఫలమైన చోట.. కీలకమైన 42 పరుగులు చేసి శ్రేయాస్‌తో ఐదో వికెట్‌కు 98 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ భాగస్వామ్యంతో భారత్ 249 పరుగుల పోరాడే స్కోరును సాధించింది. బ్యాట్‌తో మెరిసిన అక్షర్.. ఆ తర్వాత బంతితో 10 ఓవర్లలో 32 పరుగులే ఇచ్చి తన స్పెల్‌లో లాస్ట్ బాల్‌కు ప్రమాదకర కేన్ విలియమ్సన్‌ను ఔట్ చేశాడు. విలియమ్సన్ అప్పటికే 81 పరుగులు చేసి ఆ జట్టును విజయపథం వైపు నడిపిస్తుండగా అక్షర్ అతడిని ఔట్ చేయడంతో మ్యాచ్ భారత్ వైపు మళ్లింది. వరుణ్ ఐదు వికెట్ల ప్రదర్శనతో అక్షర్ ప్రదర్శనను ఎవరూ పట్టించుకోలేదు. ఇక సెమీస్‌లో ఆస్ట్రేలియాతోనూ అక్షర్ ఆల్‌రౌండ్ షోతో టీమ్‌ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించాడు.



# వారియర్స్ ఆశలు ఆవిరి!

## యూపీపై ముంబై ఇండియన్స్ ఘనవిజయం

### హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

### ఐదు వికెట్లతో మెరిసిన అమెలియా కెర్

లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ‘ప్లే ఆఫ్’ దశకు అర్హత సాధించే అవకాశాలు సజీవంగా ఉండాలంటే గెలవాల్సిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ జట్టు నిరాశపరిచింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలిచి ప్లే ఆఫ్స్ దశకు చేరువైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. జార్జియా వోల్ (33 బంతుల్లో 55బీ 12 ఫోర్లు) డబ్ల్యూపీఎల్‌లో తొలి అర్ధశతకంతో ఆకట్టుకోగా... గ్రేస్ హ్యారిస్ (28బీ 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ దీప్తి శర్మ (27బీ 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కిరణ్ నవ్‌గిరె (0), షినెల్ హెన్రీ (6), శ్వేత సెహ్రావత్ (0), ఉమా ఛెత్రీ (1) విఫలమయ్యారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అమెలియా కెర్ 38 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ హేలీ మాథ్యూస్ (2 వికెట్లుబీ 68 పరుగులు) ఆల్‌రౌండ్ ప్రదర్శన తో మెరిపించింది. ఓపెనర్లు రాణించడంతో ఒకదశలో 7.5 ఓవర్లలో 74 పరుగులు చేసిన యూపీ వారియర్స్ ఆ తర్వాత అదే జోరు కొనసాగించలేకపోయింది. అమేలియా విజృంభణతో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి సాధారణ స్కోరుకే పరిమితమైంది. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై ఇండియన్స్ 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. హేలీ (46 బంతుల్లో 68బీ 8 ఫోర్లు, 2 సిక్సులు), సివర్ బ్రంట్ (23 బంతుల్లో 37బీ 7 ఫోర్లు) రాణించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 58 బంతుల్లోనే 92 పరుగులు జోడించడంతో ముంబై సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. లీగ్‌లో భాగంగా శుక్రవారం జరగనున్న మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో గుజరాత్ జెయింట్స్ ఆడుతుంది.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595




# బజాజ్ 'ఈ-ఆటో'

న్యూఢిల్లీ, మార్చి 4: ప్రముఖ వాహన సంస్థ బజాజ్ ఆటో..తాజాగా ఎలక్ట్రిక్ ఆటో సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టింది. గోగో బ్రాండ్‌తో సరికొత్త ఆటోలను మార్కెట్‌కు పరిచయం చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 251 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. రెండు రకాల్లో లభించనున్న ఈ ఆటోల్లో గోగో పీ5009 రకం ధర రూ.3,26,797 గాను, పీ7012 ధర రూ.3,93,004గా నిర్ణయించింది. బ్యాటరీపై సంస్థ ఐదేండ్లపాటు వ్యారంటీ కల్పించింది.

## మొదలైన పసిడి పరుగు: భారీగా పెరిగిన ధరలు



వారం రోజులు తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు.. ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. నేడు (మార్చి 04) గోల్డ్ రేటు గరిష్టంగా రూ. 760 పెరిగింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో ఏ ప్రాంతంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడలలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 80,100 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 87,380 వద్ద నిలిచాయి. నిన్న స్థిరంగా ఉన్న గోల్డ్ రేటు.. ఈ రోజు రూ. 700 (22 క్యారెట్స్ 10గ్రా), రూ. 760 (24 క్యారెట్స్ 10గ్రా) పెరిగింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో కూడా కొనసాగుతాయి. చెన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 700, రూ. 760 పెరిగింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 80,100 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 87,380 వద్ద ఉంది.దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 80,250 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 87,530 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 700, రూ. 760 ఎక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు ఎక్కువగానే ఉంది. బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు గరిష్టంగా రూ.2,000 పెరిగింది. దీంతో ఈ రోజు (మార్చి 3) కేజీ సిల్వర్ రేటు రూ. 1,07,000 చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకేవిధంగా ఉన్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 1000 పెరిగి.. రూ. 98,000 వద్దకు చేరింది.

# మార్కెట్‌లోకి టీవీఎస్ జూపిటర్ సరికొత్త రూపం.. కొత్త బండి లాంచ్





**టీవీఎస్ మోటార్ కంపెనీ 2025 టీవీఎస్ జూపిటర్ 110 స్కూటర్‌ను భారత మార్కెట్లో అధికారికంగా విడుదల చేసింది. ఈ కొత్త మోడల్ తాజా ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉంటుంది. అధునాతన ఎమిషన్ టెక్నాలజీలను ఇందులో టీవీఎస్ వినియోగించింది. కొత్త టీవీఎస్ జూపిటర్ 110 బేస్ డ్రమ్ వేరియంట్ ప్రారంభ ధరను రూ .76,691గా (ఎక్స్-షోరూమ్, న్యూఢిల్లీ) కంపెనీ నిర్ణయించింది.**

**వేరియంట్లు.. ధరలు**

2025 టీవీఎస్ జూపిటర్ 110 విభిన్న కస్టమర్ ప్రాధాన్యతలను తీర్చడానికి నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. ప్రారంభ డ్రమ్ వేరియంట్ ధర రూ.76,691. ఇది అన్నింటిలో కాస్త తక్కువ ఖరీదు మోడల్. డ్రమ్ అల్లాయ్ వేరియంట్ ధర రూ.82,441. ఇది మెరుగైన లుక్, మన్నిక కోసం అల్లాయ్ వీల్స్ ను అందిస్తుంది. డ్రమ్ ఎస్ఎక్స్సీ వేరియంట్ ధర రూ.85,991. ఇందులో అదనపు స్టైలింగ్, కన్వీనియన్స్ ఫీచర్లు ఉన్నాయి. డిస్క్ ఎస్ఎక్స్సీ వేరియంట్ రూ .89,791 ధరతో మెరుగైన బ్రేకింగ్ పనితీరు కోసం ఫ్రంట్ డిస్క్ బ్రేక్‌తో వస్తుంది.

**OBD-2B ప్రయోజనాలు**

OBD-2B (ఆన్-బోర్డ్ డయాగ్నస్టిక్స్) టెక్నాలజీ అనేది సరికొత్త అప్ గ్రేడ్. ఇది క్లిష్టమైన ఇంజిన్ ఉద్గార పారామీటర్ల రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తుంది. అధునాతన సెన్సార్లతో కూడిన టీవీఎస్ జూపిటర్ 110 థ్రోటిల్ రెస్పాన్స్, ఎయిర్-ఫ్యూయల్ రేషియో, ఇంజిన్ టెంపరేచర్, ఫ్యూయల్ క్వాంటిటీ, ఇంజిన్ వేగాన్ని ట్రాక్ చేయగలదు. ఇంజిన్ కంట్రోల్ యూనిట్ (%జుజఖ%) సరైన పనితీరు, మెరుగైన మన్నిక, తక్కువ ఉద్గారాలను ధృవీకరించడానికి ఈ డేటాను రియల్ టైమ్ లో ప్రాసెస్ చేస్తుంది. ఇది స్కూటర్ ను దాని జీవితచక్రం అంతటా క్లీనర్‌గా, మరింత పర్యావరణ అనుకూలమైనదిగా చేస్తుంది.

**ఇంజిన్, పనితీరు**

కొత్త టీవీఎస్ జూపిటర్ 110 స్కూటర్‌లో 113.3సీసీ, సింగిల్ సిలిండర్, 4-స్ట్రోక్ ఇంజన్ ఇచ్చారు. ఇది 6,500 ఆర్‌పీఎం వద్ద 5.9 కిలోవాట్లను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజన్ అసిస్ట్ తో 5,000 ఆర్‌పీఎం వద్ద 9.8 ఎన్‌ఎం టార్క్, 5,000 ఆర్‌పీఎం వద్ద 9.2 ఎన్ఎమ్ టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. ఇది స్మూత్ యాక్సిలరేషన్, ఇంధన సామర్థ్యాన్ని అందిస్తుంది. సౌకర్యవంతమైన, స్థిరమైన రైడ్ కోసం రూపొందించిన ఈ స్కూటర్‌లో 1,275 మిమీ వీల్ బేస్, 163 మిమీ గ్రౌండ్ క్లియరెన్స్ ఉంటుంది.

**డిజైన్, ఫీచర్లు**

టీవీఎస్ జూపిటర్ 110లో డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, బ్లూటూత్ కనెక్టివిటీ, డీఆర్‌ఎల్‌లతో కూడిన ఎల్‌ఈడీ హెడ్‌లైట్లు, కాల్ అండ్ ఎస్ఎంఎస్ అలర్ట్స్, నావిగేషన్, ఐగో అసిస్ట్, హజార్డ్ ల్యాంప్స్, వాయిస్ అసిస్టెన్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఇది రెండు వైపులా 12-అంగుళాల వీల్స్ ఉంటాయి. ముందు భాగంలో టెలిస్కోపిక్ ఫోర్కులు , వెనుక భాగంలో మోనో-షాక్ ను కలిగి ఉంది. రెండు వీల్స్‌కు డ్రమ్ బ్రేక్స్ ఇచ్చారు. ఫ్రంట్ డిస్క్ బ్రేక్ లు అధిక ట్రిమ్ లలో లభిస్తాయి.



## కో-వర్కింగ్‌కు డిమాండ్.. స్టార్టప్స్‌తో పాటు ప్రధాన కంపెనీలు కూడా..

సిటీబ్యూరో: కరోనా తర్వాతి నుంచి కో-వర్కింగ్ స్పేస్‌కు డిమాండ్ పెరిగింది. స్టార్టప్స్‌తో పాటు ప్రధాన కంపెనీలు కూడా ఫ్లెక్సిబుల్ వర్క్ ప్లేస్‌ల నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీంతో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ప్రతి ఏటా కో%-%వర్కింగ్ స్పేస్ లావాదేవీల వాటా 20 శాతానికి పైగా ఉంటుంది. కో%-%వర్కింగ్ స్పేస్ డిమాండ్‌కు ప్రధాన కారణం సిటీ సెంటర్లు లేదా ప్రధాన ఉపాధి కేంద్రాలలో మాత్రమే కాకుండా నగర వ్యాప్తంగా విస్తరించి ఉండటమే.. అభివృద్ధి చెందుతున్న కొత్త ఏరియాలు, శివారు ప్రాంతాలు, గృహ సముదాయాలకు చేరువలో ఈ సెంటర్లు ఉంటున్నాయి. అలాగే ప్రధాన మెట్రో నగరాలలో షాపింగ్ మాల్స్, హెూటళ్లలోనూ ఫ్లెక్సిబుల్ స్పేస్‌లు అందుబాటులోకి వచ్చాయి.దీంతో చాలా కంపెనీలు ఉద్యోగుల గృహాలకు చేరువలో ఉండే కో%-%వర్కింగ్ స్పేస్‌లను తీసుకొని కార్యకలాపాలు సాగిస్తున్నాయని అనరాక్ గ్రూప్ ఛైర్మన్ అనూజ్ పూరీ తెలిపారు. అలాగే ఫ్లెకిబుల్ ఆఫీస్ స్పేస్ అద్దె కూడా సాధారణ ఆఫీసు స్పేస్ రెంట్స్‌కు సమానంగా ఉండటం, రెగ్యులర్ ఆఫీసు స్పేస్‌కు ఉండే 3-4 ఏళ్ల లాకిన్ పీరియడ్‌తో పోలిస్తే కో%-%వర్కింగ్ స్పేస్‌కు కాల పరిమితి ఉండకపోవటం వంటివి కూడా కంపెనీల ఆకర్షణకు కారణాలని ఆయన పేర్కొన్నారు.

## అనుమానం వస్తే అవి కూడా.. ఐటీ అధికారులకు కొత్త అధికారాలు




ఆదాయ పన్ను శాఖ అధికారులకు కొత్త అధికారాలు రానున్నాయి. అనుమానం వస్తే మీ సోషల్ మీడియా ప్రొఫైల్స్, ఇ-మెయిల్స్, బ్యాంక్ అకౌంట్లు, ఆన్‌లైన్ ఇన్వెస్ట్మెంట్స్, ట్రేడింగ్ ఖాతాలపై దర్యాప్తు చేసే చట్టబద్ధమైన హక్కు ఆదాయపు పన్ను శాఖకు ఉంటుంది. మీరు పన్నులు ఎగ్గొట్టారని లేదా ఏదైనా అప్రకటిత ఆస్తులు, నగదు, బంగారం, ఆభరణాలు లేదా ఇతర విలువైన వస్తువులను కలిగి ఉన్నారని ఐటీ అధికారులకు అనుమానం వస్తే వారు మీ ఖాతాలను దర్యాప్తు చేయవచ్చు.ప్రతిపాదిత ఆదాయపు పన్ను బిల్లు కింద ఈ కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని ఎకానమిక్ టైమ్స్ నివేదిక తెలిపింది. ఆర్థిక మోసాలు, అప్రకటిత ఆస్తులు, పన్ను ఎగవేతలను నిరోధించడంలో భాగంగా డిజిటల్ యుగానికి అనుగుణంగా పన్ను దర్యాప్తు ప్రక్రియకు మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని సెక్షన్ 132 ప్రకారం, పన్ను ఎగవేత ఉద్దేశంతో ఎవరైనా తన ఆదాయం, ఆస్తులు లేదా ఆర్థిక వివరాలను దాచినట్లు విశ్వసనీయ సమాచారం ఉంటే పన్ను అధికారులు తనిఖీలు చేసి సీజ్ చేయవచ్చు. అప్రకటిత ఆస్తులు, ఆర్థిక రికార్డులు దాగి ఉన్నాయని అనుమానం వస్తే తలుపులు, సేఫ్ లు, లాకర్లు పగులగొట్టి దర్యాప్తు చేసే అధికారం ఇప్పటి వరకు వారికి ఉండేది. కానీ 2026 ఏప్రిల్ 1 నుంచి ఈ అధికారాలు డిజిటల్ సాధనాలకు కూడా విస్తరిస్తారు. అంటే పన్ను ఎగవేతకు సంబంధించిన సమాచారం దాచినట్లు అనుమానించినట్లయితే కంప్యూటర్ సిస్టమ్‌లు, ఆన్‌లైన్ ఖాతాలను యాక్సెస్ చేసే హక్కు కూడా అధికారులకు ఉంటుంది.

# హైదరాబాద్‌లో రూ.1,500 కోట్ల రియల్‌ఎస్టేట్ ప్రాజెక్ట్

హైదరాబాద్‌లో మరో భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ రాబోతోంది. రియల్ ఎస్టేట్ రంగంలో తన ముద్రను విస్తరించడానికి జువారీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యంలోని అనుబంధ సంస్థ జువారి ఇన్‌ఫ్రావరల్డ్ ఇండియా లిమిటెడ్ (జువారీ ఇన్‌ఫ్రా) గంగోత్రి డెవలపర్స్‌తో డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హైదరాబాద్ లోని కొల్లూరు మైక్రో మార్కెట్ లో సుమారు 9.4 ఎకరాల విస్తీర్ణంలో ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టును అభివృద్ధి చేయడమే ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం లక్ష్యం.

**1,730 అపార్ట్‌మెంట్లు**

"జువారి గంగోత్రి త్రిభుజ" పేరుతో చేపట్టిన ఈ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ కొల్లూరు మైక్రో మార్కెట్ లో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టులో 1,730 విశాలమైన మూడు, నాలుగు పడక గదుల అపార్ట్‌మెంట్లతో కూడిన తొమ్మిది ఎత్తైన టవర్లు ఉంటాయి. రూ.1,500 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ సుమారు 3.8 మిలియన్ చదరపు అడుగుల అమ్మకపు విస్తీర్ణాన్ని, సుమారు 5.3 మిలియన్ చదరపు అడుగుల మొత్తం అభివృద్ధి ప్రాంతాన్ని కలిగి ఉంటుంది.

**ఒప్పందం పరిధి**

డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ అగ్రిమెంట్ కింద బ్రాండింగ్, మార్కెటింగ్, సేల్స్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్మెంట్ (సీఆర్‌ఎం), నిర్మాణ పర్యవేక్షణతో సహా సమగ్ర నిర్వహణ సేవలను జువారీ ఇన్‌ఫ్రా అందిస్తుంది. ఈ సహకారం రియల్ ఎస్టేట్ అభివృద్ధిలో జువారీ ఇన్‌ఫ్రా నైపుణ్యాన్ని, గంగోత్రి డెవలపర్స్ నిర్మాణ సామర్థ్యాలను ప్రపంచ స్థాయి రెసిడెన్షియల్ ప్రాజెక్టును అందించడానికి ఉపయోగిస్తుంది.

**సౌకర్యాలు, ఫీచర్లు**

ఈ ప్రాజెక్ట్ అక్కడ నివసించేవారి జీవన అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన జీవనశైలి సౌకర్యాల శ్రేణిని అందిస్తుంది. స్విమ్మింగ్ పూల్స్, ఫిట్‌నెస్ సెంటర్లు, క్రీడా సౌకర్యాలు, ల్యాండ్‌స్కేప్డ్ గార్డెన్లతో సహా 50కి పైగా జీవనశైలి సౌకర్యాలతో పాటు సుమారు 100,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక గ్రాండ్ క్లబ్ హౌస్ ప్రధాన ఫీచర్‌గా ఉంటుంది. ఆధునిక నగరవాసుల అవసరాలను తీర్చడం ద్వారా స్థిరమైన జీవన వాతావరణాన్ని అందించడం ఈ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ లక్ష్యం.

**వ్యూహాత్మక స్థానం**

వ్యూహాత్మకంగా ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 2కు కేవలం రెండు నిమిషాల దూరంలో ఉన్న ఈ ప్రాజెక్టు హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి కీలక వ్యాపార కేంద్రాలకు అద్భుతమైన కనెక్టివిటీని అందిస్తుంది. ఈ స్థానం ప్రధాన ఉపాధి కేంద్రాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, వినోద కేంద్రాలకు అందుబాటులో ఉంటుంది. ఈ సౌలభ్యాన్నీ కోరుకునే గృహ కొనుగోలుదారులకు ఇది అనువైన ఎంపికగా మారుతుంది.





## ప్రయాణమే ముఖ్యం ఫలితాలు పట్టించుకోను..

'జయాపజయాలు నన్ను ప్రభావితం చేయలేవు. వాటి కారణంగా ఆనందంగా లేనని, బాధపడనని నేననను. కానీ అది ఆ క్షణం వరకే. ఫలితం ఏదైనా మరింత ఉత్సాహంగా ముందుకు సాగడమే నాకు తెలుసు.' అని అలియాభట్ అన్నారు. గత ఏడాది విడుదలైన ఆమె 'జిగ్రా' సినిమా పెద్దగా ఆడలేదు. ఈ ఫలితంపై అలియా కూడా ఇప్పటివరకూ స్పందించలేదు. రీసెంట్‌గా 'జిగ్రా' గురించి ఆమె మాట్లాడారు. 'నాకు నటన అంటే ఇష్టం. సినిమా అంటే ప్రాణం. అందుకే ఓ వైపు నటిస్తూ, మరో వైపు నిర్మాతగా కూడా కొనసాగుతున్నా. సినిమాకు సంబంధించి నాకు ఎన్నో కలలు ఉన్నాయి. వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడుతూనే ఉంటా. ఈ క్రమంలో ఎలాంటి ఫలితాలు వచ్చినా పట్టించుకోను. గత ఏడాది 'జిగ్రా' సినిమా చేశాను. నిజానికి అది నా డ్రీమ్ ప్రాజెక్ట్. కొత్తగా ప్రయత్నించాను. దర్శకుడు వాసన్ బాలా కూడా బాగానే తీశారు. కానీ ఫలితం మాత్రం వేరేగా వచ్చింది. కానీ నిరాశపడలేదు. మరింత ఉత్సాహంతో ముందుకెళ్తున్నా.' అని చెప్పారు అలియాభట్.

## అప్పుడే ప్రేమలో పడిపోయా!



ఇటీవల తన చిరకాల మిత్రుడు ఆంటోనీతో కలిసి పెళ్లి పీటలెక్కింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. గోవా వేదికగా వీరిద్దరి వివాహం వైభవంగా జరిగింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆంటోనితో ప్రేమ, పెళ్లి గురించిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది కీర్తి సురేష్. ఇంటర్ చదవుతున్నప్పుడే ఆంటోని ప్రేమలో పడిపోయానని, దాదాపు 15 ఏండ్లుగా తమ ప్రేమాయణం కొనసాగుతున్నదని చెప్పింది. 'ఆంటోని నాకంటే ఏడేళ్లు పెద్ద. 2010లో తను నాకు తొలిసారి లవ్‌ప్రపోజ్ చేశాడు. అప్పుడే నాకు ప్రామిస్ రింగ్‌ను బహుమతిగా ఇచ్చాడు. దానిని ఇప్పటివరకు తీయలేదు. మేమిద్దరం గత రెండేళ్లుగా పెళ్లి ప్రయత్నాల్లో ఉన్నాం. డిసెంబర్‌లో వివాహబంధంలోకి అడుగుపెట్టాం. ఆంటోనికి పబ్లిక్‌లైఫ్‌లో కనిపించడం అంతగా ఇష్టం ఉండదు. కాస్త సిగ్గు ఎక్కువ. అందుకే మేమిద్దరం ఎప్పుడూ మీడియా ముందుకురాలేదు. ఆంటోనిలాంటి మంచివాడు నా జీవితంలోకి రావడం అదృష్టంగా భావిస్తున్నా' అని కీర్తి సురేష్ ఆనందం వ్యక్తం చేసింది.

## జాతస్య మరణం ధ్రువం

జేడీ చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ రచనా, దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి మల్కాపురం శివకుమార్ నిర్మాత. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని గురువారం మేకర్స్ విడుదల చేశారు. జేడీ చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ సీరియస్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ప్రీతి జింఘానియా రీఎంట్రీ ఇస్తున్న ఈ చిత్రంలో రాజేష్‌శర్మ, తనికెళ్ల భరణి, హిట్లెన్ తేజ్వాణి, మస్త్ అలీ, తులసి, ఈటీవీ ప్రభాకర్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: అర్జున్ రాజా, సంగీతం: జిబ్రాన్, రాజ్ ఆషూ.





## ఉత్కంఠను రేకెత్తించే వీర ధీర సూరన్2

చియాన్ విక్రమ్ నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ పాక్డ్ మూవీ 'వీర ధీర సూరన్ పార్ట్2'. ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకుడు. రియా శిబు నిర్మాత. ఎస్.జె.సూర్య, సూరజ్ వెంజరాముదు, దుషార విజయన్ కీలక పాత్రధారులు. ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని, ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి స్పందన వస్తున్నదని, ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. తేని ఈశ్వర్, సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈచిత్రానికి జి.వి.ప్రకాష్‌కుమార్ దర్శకుడు. ఎన్వీఆర్ సినిమాస్ ద్వారా ఈ సినిమా తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

## హృదయాన్ని కదిలిస్తుంది



మరాఠీ యోధుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా రూపొందిన 'ఛావా' చిత్రానికి దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తున్నది. విక్కీ కౌశల్, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ చిత్రానికి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్ నిర్మాత. ఈ సినిమా వసూళ్లు 700కోట్లకు చేరువవుతున్నాయి. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ తెలుగులో విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు వెర్షన్ రిలీజ్ సందర్భంగా హీరో విక్కీకౌశల్ ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సినిమా విడుదలైన మొదటివారం నుంచి తెలుగులో డబ్ చేయాలనే డిమాండ్స్ వచ్చాయని, గీతా ఆర్ట్స్ సంస్థ రిలీజ్ చేయడం ఆనందంగా ఉందని, శంభాజీ మహారాజ్ అసమాన త్యాగాన్ని ఆవిష్కరిస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్ని కదిలిస్తుందని విక్కీ కౌశల్ వీడియోలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 550 స్క్రీన్స్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ వెల్లడించింది.



## నాన్నతోనే లైంగిక వేధింపులు..

### చనిపోయాడని తెలిసినా వెళ్లలేదు: ఖుష్బూ

ఏ బిడ్డకు అయినా తండ్రే సూపర్ హీరో. ముఖ్యంగా ఆడపిల్లలు నాన్న అంటేనే ఎక్కువ ఇష్టపడతారు. ఎవరైనా వేధిస్తే నాన్నతో చెప్పుకోవాలనుకుంటారు. కానీ నాన్నే వేధిస్తే.. లైంగిక దాడికి పాల్పడితే?.. ఈ కష్టాలను తట్టుకొని నిలబడింది సీనియర్ నటి ఖుష్బూ . పలు సందర్భాల్లోనూ తన తండ్రి వల్ల లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానంటూ బహిరంగంగా చెప్పింది. తాజాగా మరోసారి తన తండ్రి వల్ల ఆమె పడిన కష్టాలు, ఫ్యామిలీకి ఎదురైన సమస్యల గురించి బయటపెట్టింది. తనపై తండ్రి చేసిన లైంగిక దాడి బయటకు చెబితే ఎక్కడ ఇబ్బంది పెడతారోనని భయపడి చాలా కాలం దాచానని ఆమె చెప్పారు. కెరీర్ పరంగా బాగా సెట్ అయిన తర్వాత తండ్రిని ఎదురించానని చెప్పింది.మా నాన్నతోనే నాకు లైంగిక వేధింపులు ఎదురయ్యాయి. నా తల్లిని, సోదరులను దారుణంగా హింసించేవాడు. బెల్టు, చెప్పులు, కర్ర.. ఇలా ఏది దొరికితే దానితో కొట్టేవాడు. చిన్నతనంలోనే నేను ఇలాంటి వేధింపులను చూశా. నాపై జరుగుతున్న లైంగిక వేధింపులు బయటకు చెబితే ఇంకెంత హింసిస్తారోనని భయపడి చెప్పలేదు. చెన్నైకి వచ్చి, నా కాళ్లపై నేను బతకడం ప్రారంభించిన తర్వాత నాలో ఆత్మస్థైర్యం పెరిగింది. ఆ తర్వాత కూడా మా నాన్న నన్ను వేధించాడు. దీంతో నేను ఎదురు తిరిగాను .అది తట్టుకోలేక షూటింగ్ ప్రదేశానికి వచ్చి అందరి ముందు కొట్టేవాడు. ఉబిన్ అనే ఒక హెయిర్ డ్రెస్సర్ నాకు తోడుగా ఉండి ధైర్యం చెప్పింది. 14 ఏళ్ల వయసులో మా నాన్న చేసిన లైంగిక వేధింపుల గురించి బయటకు చెప్పాను. ఆ తర్వాత ఆయన మమ్మల్ని వదిలేసి వెళ్లాడు. ఆయన ఎక్కడి వెళ్లాడని కూడా మేము ఆరా తీయలేదు. ఎప్పుడు ఆయనను కలవలేదు. గతేడాది ఆయన చనిపోయాడని విషయం బంధువుల ద్వారా తెలిసింది.

## లవ్ ట్రయాంగిల్ నహీ హై!

అర్జున్ కపూర్, రకుల్‌ప్రీత్ సింగ్, భూమీ ఫడ్నేకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'మేరే హస్బెండ్‌కీ బీబీ'. 'లవ్ ట్రయాంగిల్ నహీ హై... సర్కిల్ హై' (ప్రేమ ముక్కోణం కాదు... వలయం) అనేది ఈ సినిమా క్యాప్షన్. ముదస్సర్ అజీజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వసు భగ్నానీ, జాకీ భగ్నానీ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 21న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. మరి... లవ్ సర్కిల్‌లో ఫైనల్‌గా ఏ ఇద్దరి ప్రేమ గెలిచిందో చూడాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక ఈ సినిమాయే కాకుండా హిందీలో అజయ్ దేవగన్ 'దే దే ప్యార్ దే 2' చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రకుల్. అలాగే కమల్‌హాసన్, కాజల్ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా నటించిన 'ఇండియన్ 3' చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ ఓ లీడ్ రోల్‌లో నటించారు. 'దే దే ప్యార్ దే 2' జూలైలో విడుదల కానుంది. 'ఇండియన్ 3' కూడా ఈ ఏడాదే రిలీజ్ అవుతుంది. అయితే విడుదల తేదీపై ఓ స్పష్టత రావాల్సి ఉంది.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.